

## 53 కిలోల క్యాటగిరీకి మారనున్న మీరా

టోక్యో ఒలింపిక్స్‌లో రజత పతక విజేత మీరాబాయి చాను రాబోయే లాస్‌ఏంజెల్స్ విశ్వక్రీడల్లో తన వెయిట్ క్యాటగిరీని 49 కిలోల నుంచి 53 కిలోలకు మార్చుకోనుంది. లాస్ ఏంజెల్స్ గేమ్స్ కోసం ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ).. 49 కి. విభాగాన్ని రద్దు చేసి కనిష్ట వెయిట్ క్లాస్‌ను 53 కి.గా నిర్ధారించింది. దీంతో ఆమె కొత్త క్యాటగిరీకి మార్చుకోవాల్సి వచ్చింది. టోక్యోలో ఆమె 49 కి. విభాగంలోనే రజతం గెలిచింది. అయితే 53 కి. క్యాటగిరీకి మారడం మీరాకు మంచిదేనని ఆమె కోచ్ విజయ్ శర్మ తెలిపాడు. టోర్నీ కోసం బరువు తగ్గడం.. దానిని మెయింటెన్ చేయడం కష్టంగా ఉండేదని.. ఇకపై ఆ తిప్పలుండవని చెప్పారు. అయితే వచ్చే ఏడాది ఆసియా క్రీడల వరకూ చాను.. పాత (48/49) వెయిట్ క్లాస్‌లోనే పోటీపడుతుంది.


నిజామాబాద్
బుధవారం
05.11. 2025

సంపుటి : 16 సంచిక: 38
పేజీలు: 7 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్

# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక


# జహీరాబాదులో ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ..?




- కొన్ని ఆస్పత్రులకు ప్రభుత్వ అనుమతులు లేకపోయినా బహిరంగంగా
- ఆస్పత్రులు నిర్వహణ దయాగ్నస్టిక్ సెంటర్లు ఏర్పాటు
- పట్టించుకోని జిల్లా వైద్యశాఖ అధికారులు



**చట్టం న్యూస్ జహీరాబాద్:**

పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల వైద్యుల దోపిడీ రోజురోజుకూ విపరితంగా పెరిగిపోయింది. రాష్ట్ర సరిహద్దులో ఉండడం, మారుమూల గ్రామాలు, తండాల్లో నుంచి వచ్చే ప్రజల నుండి ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు అందిన కాడికి దోపిడీ చేస్తున్నారు. జ్వరము, జలుబు. టైఫాయిడ్, మలేరియా , ముఖ్యంగా చిన్న పిల్లలకు వచ్చిందని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యుల వద్దకు వెళితే వారు పేద ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా జహీరాబాద్ మండలం కేంద్రంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాలలో నుంచి వచ్చే రోగులను వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రిలు ఏర్పాటు చేసుకొని అందిన కాడికి డబ్బులు వసూలు చేస్తు న్నారు. పేదల నుంచి ఇష్టారాజ్యంగా పరీక్షల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న వైద్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. అదేవిధంగా ఆస్పత్రులకు అనుమతులు లేకపోయినా బహిరంగంగా ప్రైవేట్ దవాఖానాలు ఏర్పాటు చేసుకుని రక్త పరీక్షలు, వైద్యం చేస్తున్నారు. ముఖ్యంగా మెడికల్ షాపులకు ప్రభుత్వ అనుమతి లేకపోయినా మెడికల్ యాజమాన్యాలు మందులు అమ్మకాలు చేస్తున్నారు. రక్తపరీక్షలు చేసేందుకు జిల్లా వైద్య శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉన్న ఎలాంటి అనుమతులు లేకుండా అన్ని ల్యాబ్ లు ఏర్పాటు కూడా చేస్తున్నారు.

అంతేకాకుండా డయాగ్నస్టిక్ సెంటర్లలో మూత్ర విసర్జనకు వాళ్లకు దాదాపుగా రూ.600 నుంచి 800 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. పలు మార్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కావున ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రైవేటు ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించి, తగు చర్యలు తీసుకోవాలని, దవాఖానాల్లో ఎలాంటి సౌకర్యాలు లేకపోయినా పేద ప్రజల నుంచి అందిన కాడికి దోపిడీ చేస్తున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉద్యోగం చేస్తూ కూడా ప్రైవేట్ ఆసుపత్రులు ఏర్పాటు చేసుకొని వైద్య చికిత్సలు చేస్తున్నారు. గతంలో ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్ గా, అదేవిధంగా ట్రైనింగ్ గా పనిచేస్తున్న వ్యక్తులు వారే ప్రస్తుతం డాక్టర్లుగా చలామణి అవుతున్నారు. దీనిపై జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకొని ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడిని నివారించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు..



## రెండు రోజుల్లో పంట నష్టం నివేదిక అందజేయాలి

- వారంలో రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి
- నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలి
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**చట్టం, హనుమకొండ:**

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని ధర్మసాగర్, వేలేరు మండలాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చేపట్టిన సర్వేకు సంబంధించి రెండు రోజుల్లో నివేదికను అందజేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వర్షం వల్ల జరిగిన నష్టాలపై శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భారీ వర్షాలతో వివిధ పంటలు, పశు సంపద , రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్న వివరాలను, ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు, పంట నష్ట వివరాల నమోదు, తదితర వివరాలను సంబంధిత శాఖల అధికారులు ఎమ్మెల్యే, కలెక్టర్ కు తెలిపారు. సమావేశంలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ భారీ వర్షాలతో నీటి సామర్థ్యం ఎక్కువగా ఉన్నందున ధర్మసాగర్ రిజర్వయర్ గేట్స్ ఎత్తాలన్నారు. భారీ వర్షాలు మరో రెండు రోజులపాటు ఉన్నందున సాగునీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. క్లౌడ్ బరస్ట్ వరంగల్ లోనే అవకాశం ఉన్నందున రిజర్వాయర్ గేట్స్ నుంచి నీటిని విడుదల చేయాలని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పంటల నష్టం వివరాలను నమోదు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతుల పరిస్థితి అధ్వానంగా మారిపోయిందని, నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా లిబరల్ గా పంట నష్ట వివరాలు నమోదు చేయాలని తెలిపారు. పలు గ్రామాలలో రైతులు ఆరబోసిన ధాన్యము కొట్టుకుపోయిందని, అలాగే తడిసిన ధాన్యము ని బాయిల్డ్ మిల్లులకు తరలించాలన్నారు. వర్షాలు ఉన్నందున వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. పశు సంపద నష్టపోయిన వారిని వెంటనే ఆదుకునేందుకు ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ధర్మసాగర్, వేలేరు మండలాల్లో దెబ్బతిన్న రోడ్లను వెంటనే తాత్కాలిక పునరుద్ధరణ చర్యలలో భాగంగా మరమ్మతులు చేపట్టాలన్నారు. రోడ్లపై ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న రోడ్లను వారం రోజుల్లో తాత్కాలిక పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేలేరు కొత్తకొండ ల మధ్య ఉన్న రోడ్డు ను స్ట్రెంతేనింగ్, వైడెనింగ్ చేయడం తో పాటు కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

### ఇందిరమ్మ ఇండ్లకు ప్రతిపాదనలు..

పంటలు, రోడ్లు, పశు సంపద నష్టంపై సంబంధిత శాఖల అధికారులు అంచనాలను త్వరగా అందజేయాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. పాక్షికంగా, పూర్తిగా ఇండ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ప్రతిపాదనలు అందజేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఆర్డిఓ మేన శ్రీను, పంచాయతీరాజ్ ఈఈ ఆత్మారాం, ఇరిగేషన్ ఈఈ మంగీలాల్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, ధర్మ సాగర్, వేలేరు తహసీల్దార్లు సదానందం, కోమి, ఎంపీడీవోలు అనిల్ కుమార్, లక్ష్మీ ప్రసన్న, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి, సాగునీటిపారుదల, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సజావుగా పత్తి కొనుగోళ్లు

**కలెక్టర్ రాజర్శి షా**

**చట్టం, ఆదిలాబాద్**

జిల్లాలో పత్తి కొనుగోళ్లు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజార్షి షా తెలిపారు. కలెక్టరేట్ లో సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యజమానులు, మార్కెటింగ్, వ్యవసాయ, రవాణా, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో పత్తి కొనుగోళ్లపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లులు ఈనెల 6 నుండి నిరవధికంగా మూసివేయనున్నట్లు తెలంగాణ కాటన్ జిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ ప్రకటించిన నేపథ్యంలో, జిల్లా స్థాయిలో పరిస్థితులను సమీక్షించామని తెలిపారు. సీసీఐ వారు జిన్నింగ్ మిల్లులకు జాబ్ వర్క్ కేటాయింపును ఎల్ 1, ఎల్ 2 విధానంలో నిర్వహించడంపై మిల్లుల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారని, ఈ అంశంపై జిల్లా స్థాయి కమిటీ చర్చించి అభిప్రాయాలను రాష్ట్ర స్థాయికి నివేదించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ముంబాయి) స్థాయిలో తీసుకునే తుది నిర్ణయం ప్రకారం పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయని తెలిపారు. సీసీఐ వారు నవంబర్ 3 నుండి ఎకరాకు పత్తి కొనుగోలు పరిమితిని 11.74 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్లకు తగ్గించినట్లు తెలిపారు. జిల్లాలోని పత్తి మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని, తగిన రవాణా, అగ్నిమాపక, భద్రతా చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, అదనపు ఎస్పీ సురేందర్ రావు, మార్కెటింగ్ అధికారి గజానన్, జిన్నింగ్ మిల్లుల యజమానులు, అధికారులు పాల్గొన్నారు.



## వడ్ల లోడ్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

**తిమ్మాపూర్‌లో తప్పిన పెను ప్రమాదం**

**చట్టం, మానకొండూర్:**

ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు నిద్రమత్తులో ఉండగా తెల్లవారుజామున ఓ వడ్ల లోడు ట్రాక్టర్ ను బస్సు ఢీకొన్న ఘటనలో ఘోర రోడ్ ప్రమాదం తప్పింది. ఈ రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలతో ప్రయాణికులు బయటపడ్డారు. ఎవరికి ఎలాంటి ప్రాణం నష్టం జరగలేదు. వివరాల్లోకి వెళితే మంగళవారం తెల్లవారుజామున కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని రేణిగుంట శివారులో వడ్ల బస్తాల లోడుతో రాజీవ్ రహదారిపై అలుగునూర్ రైస్ మిల్లుకు కరీంనగర్ వైపు వస్తోంది. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీ రేణిగుంట మోయ తుమ్మెద వాగు బ్రిడ్జి సమీపంలో వడ్ల బస్తాల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ట్రాక్టర్ రోడ్డు పక్కన బోల్తాపడింది. బస్సులో ఉన్న ప్రయాణికులు 15 మంది గాయపడ్డారు. ప్రమాదం ధాటికి బస్సు ముందుభాగం ధ్వంసం అయింది.

మెట్‌పల్లి డిపోకి చెందిన బస్సు టీఎస్ 21 జెడ్ 0116 హైదరాబాద్ నుంచి మెట్‌పల్లి వెళ్తోంది. ఈ క్రమంలో రేణిగుంట శివారులో ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ట్రాలీతో సహా ట్రాక్టర్ రోడ్డు కిందికి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదాన్ని గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ రవి కిందికి దూకేశాడు. దీంతో తృటిలో ప్రాణాపాయం



నుంచి తప్పించుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి స్వల్పంగా గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం పోలీసులు తమ వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 31 మంది ప్రయాణిస్తున్నారని వారిలో 15 మంది గాయపడ్డారని చెప్పారు. ఈ ఘటపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నామని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

## పంట, ఆస్తి నష్టం వివరాలు సమర్పించాలి

- ముంపు నివారణకు ప్రణాళిక అందజేయాలి
- వరంగల్ కలెక్టర్ సత్య శారద

**చట్టం, వరంగల్:**

ఇటీవల నగరంలో వచ్చిన వరదల వల్ల నష్టపోయిన పంట, ఆస్తి వివరాలు త్వరగా నమోదు చేసి సమర్పించాలని అధికారులను వరంగల్ కలెక్టర్ సత్య శారద ఆదేశించారు. నష్టంపై వివరాల నమోదు పురోగతి, పునరుద్ధరణకు చేపట్టాల్సిన తాత్కాలిక, శాశ్వత పనులు, రూపొందించాల్సిన జిల్లా, మండలాల సమగ్ర ప్రణాళిక పై మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ సమీక్షించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పునరుద్ధరణకు తాత్కాలిక, శాశ్వత మరమ్మతు పనుల వివరాలను రెండు రోజుల్లో సమర్పించాలన్నారు. భవిష్యత్తులో ముంపు సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వానికి సమర్పించుటకు జిల్లా, మండలాల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను వారం రోజుల్లోగా రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి, ఆర్డీఓ లు సుమా, ఉమారాణి, వ్యవసాయ, ఆర్ అండ్ బి, ఇంజనీరింగ్, పంచాయతీ రాజ్, విద్యుత్, రెవెన్యూ, మునిసిపల్, పశు సంవర్ధక, తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# గుండ్రెడ్డిపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరం



**చట్టం, తూప్రాన్;** పశువులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే వాటి పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం అని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటయ్య తెలిపారు. మంగళవారం ఇంటర్ నేషనల్ లయన్స్ క్లబ్స్ 320 డి డిస్ట్రిక్ట్ సెక్రెటరీ ఫర్ వెటర్నరీ క్యాంప్స్ ఏర్పాటు చేశారు. పశువులకు శుభ్రమైన నీరు అందించడం, పచ్చి మేత ఇవ్వడం, వేడి వాతావరణంలో నీడ కల్పించడం, వ్యాధులను నివారించడానికి టీకాలు వేయించడం, మరియు వ్యాధులు సోకితే వెంటనే ఇతర ఆరోగ్యకరమైన పశువుల నుండి వేరుచేయడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ తిరుపతి, కృష్ణారెడ్డి, రీజినల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ గుప్త, జోన్ చైర్మన్ లయన్ ఆకుల సుఖేందర్, డాక్టర్ జానకిరామ్ సిఆర్ పాల్గొన్నారు.

# చక్రేశ్వరాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



**చట్టం, బోధన్ :** బోధన్ పట్టణంలోని చక్రేశ్వరాలయంలో మంగళవారం నాడు సామూహిక సత్యనారాయణ వ్రతములు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శ్రీవిష్ణుమూర్తి ఆశీస్సులు అందుకున్నారు. ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో వేదోచ్చరణల మధ్య వ్రతాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించగా, అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేయబడినాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు వెళ్తుండగా ఆటో బోల్తా



**చట్టం/ ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మండలం సబ్దల్పూర్ గేటు సమీపంలో మంగళవారం ఒక ప్రమాద ఘటన సంభవించింది. హైదరాబాద్ నుండి ఎల్లారెడ్డి మండలం వెంకటపూర్ గ్రామానికి బంధువుల అంత్యక్రియలకు వెళ్తున్న సింగీతం గ్రామానికి చెందిన గంగాధర్ దంపతులు ప్రయాణిస్తున్న ఆటో, హ్యాండిల్ లాక్ అవడంతో క్లచ్ పనిచేయకపోవడం వల్ల నియంత్రణ కోల్పోయి పొలంలో బోల్తా పడిందన్నారు. అదృష్టవశాత్తు ఎవరికి గాయాలు కాలేదు. భార్యాభర్తలు స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడ్డారు.

# బోధన్ పట్టణంలో బీఎస్పీ పార్టీలో భారీగా చేరికలు

**ఆటో యూనియన్ అధ్యక్షుడు వికార్ సహా పలువురు నేతల చేరిక**



**చట్టం బోధన్:** బహుజన సమాజ్ పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షులు షేక్ మహ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బోధన్ పట్టణ ఆటో యూనియన్ అధ్యక్షులు వికార్ సహా మైనారిటీ, బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన సుమారు 30 మంది నాయకులు బీఎస్పీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని బీఎస్పీ రాష్ట్ర నాయకులు నీరడి ఈశ్వర్, జిల్లా అధ్యక్షులు సింగడే పాండు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల హక్కుల కోసం బీఎస్పీ పార్టీ చేస్తున్న పోరాటమే తమను ఆకర్షించిందని కొత్తగా చేరిన నేతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిరివెసు సంతోష్, బోధన్ అసెంబ్లీ అధ్యక్షులు దాడి రమేష్, బోధన్ అసెంబ్లీ ఇంచార్జ్ నీరడి రవి, బాన్స్ వాడ అసెంబ్లీ ఇంచార్జ్ శ్యామ్, సాలూర అధ్యక్షులు జ్ఞానేశ్వర్, బీఎస్పీ సీనియర్ నేతలు బాగారే గంగాధర్, సుభాష్, గౌతమ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఓని గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో గ్రామసభ



**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండల పరిధిలోని ఓని గ్రామంలో మంగళవారం (ఎన్ఆర్ఈజీఎస్ ) జాతీయ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో గ్రామస్తులతో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 26 27 ఆర్థిక సంవత్సరంలోని గ్రామంలో చేపట్టనున్న నూతన పనుల గురించి ఉపాధ్యాయుని పథకం ద్వారా నూతన పనుల ఎంపిక ద్వారా పనులను ఎక్కడెక్కడ నిర్వహించాలి ఏ పనులు ఎక్కడ చేపట్టాలి అనే అంశంపై గ్రామస్తులతో ప్రత్యేక గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులతో అధికారులు గ్రామ ప్రజల అభిప్రాయాలను సేకరించి నూతన పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి గంగా సింగ్ (ఎంపీ ఓ ) ఏపీవో సదానంద్ చారి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సాంకేతిక సహాయకులు రాజు, గ్రామ క్షేత్ర సహాయకులు రాములు, గ్రామస్తులు దత్త హరి పటేల్ సంజీవ్ ఆత్మరామ్ సిద్ధూ కారోభారీ, రావు సాబ్, రఘు పటేల్, ఉండి మాజీ సర్పంచ్ సురేష్ మహిళ ఉపాధి కూలీల తో పాటు ఉపాధి కూలీలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వర్ష బాధిత రైతులకు అండగా చైర్మన్ ఏగుల నర్సింలు



**చట్టం/ ఎల్లారెడ్డి :** ప్రాథమిక సహకార సంఘం ఎల్లారెడ్డి చైర్మన్ ఏగుల నర్సింలు మంగళవారం శివనగర్, అడవి లింగాల వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన ప్రస్తుత వర్షబావ పరిస్థితుల కారణంగా వడ్లు తడవడం, మొలకెత్తడం జరుగుతుండటంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణం చొరవ తీసుకుని తడిసిన వడ్లను రైస్ మిల్లులకు అలాట్మెంట్ ఇచ్చి పంపేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సీఈఓ విశ్వనాథం, నాగం పరందాములు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# మాచాపూర్‌లో మెరిసిన రెజ్లింగ్ పోటీలు..!

**ఆర్.డీ.ఓ పార్థసింహా రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం**



**చట్టం /ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మండలం మాచాపూర్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి ఎస్.జి.ఎఫ్ రెజ్లింగ్ పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా విచ్చేసిన రెవెన్యూ డివిజనల్ అధికారి పార్థసింహా రెడ్డి చేతులమీదుగా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలోనూ రాణించాలని, క్రీడా స్ఫూర్తి మనిషిని క్రమశిక్షణతో ముందుకు నడిపిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రజిత వెంకట్ రెడ్డి, మండల విద్యాధికారి ఎల్.రాజులు, ఎస్.జి.ఎఫ్ జిల్లా సెక్రటరీ హీరా లాల్ పాల్గొన్నారు. అలాగే పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి, నర్సింలు, రెజ్లింగ్ ప్రెసిడెంట్ విజయ్ చౌహన్, సెక్రటరీ పవన్ కుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆకుల కిష్టయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు హాజరయ్యారు. పోటీలలో జిల్లా వ్యాప్తంగా పలువురు విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకుంటున్నారు.

# జంగమయపల్లిలో ఎంపీడీవో పర్యటన పాఠశాల, అంగన్వాడీ తనిఖీ



**చట్టం/ ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మండల ఎంపీడీవో తాహెరా బేగం, ఎంపీ.ఓ ప్రకాష్ జంగమయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమావేశమై పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో తాహెరా బేగం సూచించారు. ప్రభుత్వ పథకాలు సమయానికి పూర్తయ్యేలా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఆమె అన్నారు. అనంతరం ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రాం రెడ్డి నూతనంగా ఎల్లారెడ్డికి విచ్చేసిన ఎంపీడీవో తాహెరా బేగం ను శాలువాతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం అధికారుల బృందం గ్రామంలో అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను పరిశీలించింది. విద్యార్థుల హాజరు, రికార్డులను తనిఖీ చేసి, పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి పచ్చదనం, ప్రకృతి సంరక్షణకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోడ్లపై గుంతల గండం రేవంత్ సర్కార్ మేల్కోవాల్సిందే



**చట్టం రామాయంపేట :** రోడ్లపై గుంతలతో బెంగళూరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత బద్నామ్ అయిపోయిందో కళ్ల ముందే ఉంది. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం మేలుకోవడం లేదు. గత రెండేళ్లుగా రోడ్ల నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది. హైదరాబాద్ లో రోడ్ల పరిస్థితి దారుణంగా మారుతోంది. ప్రతి రోడ్లు గుంతల మయం అవుతోంది. అవి కూడా అత్యంత ప్రమాదకరమైన గుంతలుగా మారుతున్నాయి. ఎంత మంది వాహనదారులు కింద పడి దెబ్బలు తగిలించుకుంటున్నారో లెక్కే లేదు. అక్కడ ప్రమాదం జరిగిందని తెలిసిన తర్వాత కూడా ఆ గుంతలు పూడ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. అదే అసలైన విషాదంగా మారింది.

**గుంతల వల్ల ప్రాణం పోతే అది ప్రభుత్వ హత్యే !**

రోడ్ల మీద గుంత ఒక్క ప్రాణం తీసిందంటే.. సంబంధిత వ్యవహారాలు చూసే ఉద్యోగులే హత్య చేసినట్లుగా. హైదరాబాద్ లో కానీ.. తెలంగాణ మొత్తం కానీ రోడ్లన్నీ కొంత మంది పరిధిలో ఉంటాయి. వాటికి రిపేర్లు చేయించి చక్కని నిర్వహణ ఉండేలా చూడాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. వారికి కావాల్సిన నిధులను ప్రభుత్వం అందుబాటులో ఉంచాల్సిందే. అలా చేయకపోతే ప్రజా ప్రాణాలతో చెలగాట మాడినట్లే. చేవెళ్ల రోడ్డు ప్రమాదంలో .. గుంత వల్లనే పెద్ద ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న టిప్పర్ గుంతలో పడటంతో డ్రైవర్ కంట్రోల్ చేయలేకపోవడంతో బస్సు మీదకు వెళ్లిపోయింది.

**అధికారుల చేతకాని తనానికి ప్రజల్ని శిక్షించడం ఘోరం**

అందుకే ఆ రోడ్డు గురించి చర్చ జరుగుతోంది. ఆ రోడ్డును జాతీయ రహదారిగా మార్చిన తర్వాత కూడా విస్తరించకుండా ఆపారు. దానికి కారణం చెట్లని.. మరొకటని చెబుతూ వస్తున్నారు. కానీ ప్రమాదాలు మాత్రం జరుగుతూనే వస్తున్నాయి హైదరాబాద్ తో పాటు ఇతర ఆర్ అండ్ బీ రోడ్లు కూడా దారుణంగా మారుతున్నాయి. రోడ్ల నిర్వహణ కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులన్నీ ఉచిత బస్సు పథకానికి మళ్లుతున్నాయి. అందుకే నిర్వహణ దారుణంగా తయారవుతోంది.

**నిర్వహణ నిధులు పథకాల కోటా కాదు !**

ఉచిత పథకాలకు వేరే బడ్జెట్ ను కేటాయించుకోవాలి కానీ.. మౌలిక సదుపాయాల విషయంలో నిర్లక్ష్యం చేయకూడదు. రాష్ట్ర ప్రజలకే కాదు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి కూడా రోడ్లు చాలా ముఖ్యం. మౌలిక సదుపాయాలుంటేనే పెట్టుబడిదారులు వస్తారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం ఇప్పుడు మేలుకుని పెద్ద ఎత్తున పనులు చేస్తోంది. కానీ ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అందుకే .. రేవంత్ సర్కార్ ముందుగానే మేలుకుని రోడ్ల నిర్వహణ చేపట్టాల్సి ఉంది.

# మాకు న్యాయం చేయండి

- 14.6 ఫీట్ల సిసి రోడ్డు పై విచారణ
- విచారణ జరిపిన డిఎల్పిఓ శివకృష్ణ



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో ఓ ప్లాట్ లోని స్థలం నుండి సిసి రోడ్డు నిర్మించిన విషయమై ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని గ్రామ కార్యదర్శి, ఎంపిఓపై చర్యలు తీసుకోవాలని ఎరుగట్ల గంగారాం, అనే బాధితుడు జిల్లా కలెక్టర్ తో పాటు డిపిఓకు ఫిర్యాదు చేశానన్నారు. ఈ విషయమై డీఎల్పిఓ శివకృష్ణ చేపూరు గ్రామానికి మంగళవారం రోజు వచ్చి విచారణ చేశారు. ఈ సందర్భంగా గంగారాం మాట్లాడుతూ 10 ఫీట్ల సిసి రోడ్డు నిర్మించాల్సి ఉండగా అధికారుల తప్పిదంతో 14.6 ఫీట్లతో సిసి రోడ్డు నిర్మించారన్నారు. 2025 ఫిబ్రవరి 11వ తేదీన ఎంపీఓ, గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన ఇద్దరు అధికారులు నిర్లక్ష్యం చేశారు కాబట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు డిపిఓకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయమై డిఎల్పిఓ మంగళవారం విచారణ చేయడానికి గ్రామానికి వచ్చారు. సిసి రోడ్డు వేసిన స్థలాన్ని పరిశీలించి సిసి రోడ్డు 14.6 ఫీట్ల రోడ్డు వేసినట్లు చెప్పారు. అయితే పంచాయతీ రాజ్ అధికారులు 10 ఫీట్ల రోడ్డు వేయాలని చెప్పగా ఉపాధి హామీలో 14.6 ఫీట్ల రోడ్డు వేశారని గంగారాం డిఎల్పిఓకు వివరించారు. అధికారుల తప్పుడు విధానాల వలన తాము ప్లాట్ లోని స్థలాన్ని కోల్పోవాల్సి వస్తుందని వాదించారు. అగ్రిమెంట్ ప్రకారం రోడ్డు వేశారని చెప్పడం తప్పు అని పేర్కొన్నారు. ఈ విషయమై విచారణ జరిపిన డిఎల్పిఓ శివకృష్ణ, మాట్లాడుతూ ఎరగట్ల గంగారాం ఫిర్యాదు మేరకు విచారణ చేయడానికి వచ్చినట్లు తెలిపారు. 2007లో ఇరు వర్గాల మధ్య చేసుకున్న అగ్రిమెంట్ ఒప్పందం ప్రకారం నాన్ లేఅవుట్ ప్లాట్ లో 14.6 ఫీట్ల రోడ్డు వేశారని చెప్పారు. సంబంధిత భూమీ పత్రాలను సమర్పించమని వారికి తెలిపామన్నారు. ఈ రోజు జరిగిన విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి హరీష్, ఇరువర్గాల సభ్యులు పాల్గొన్నారు.

# భైంసా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో లైఫ్ స్కిల్స్ సర్టిఫికెట్ కోర్స్ వాలెడిక్టరీ



**చట్టం, భైంసా :** నిర్మల్ జిల్లా భైంసా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 30 రోజులపాటు నిర్వహించిన “లైఫ్ స్కిల్స్ సర్టిఫికేట్ కోర్స్” వాలెడిక్టరీ కార్యక్రమం సాహో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని రసాయనశాస్త్రం, ఇంగ్లీష్, జూలజీ, ఫిజిక్స్, విభాగాలకు సంయుక్తంగా నిర్వహించగా, విద్యార్థుల నుంచి ఉత్సవ పూర్వకంగా స్పందన లభించింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ కె. బుచయ్య, అధ్యక్షతన వహించారు. తన ప్రసంగంలో మాట్లాడుతూ... విద్యార్థులు కేవలం విద్యా పరంగా మాత్రమే కాకుండా జీవిత నైపుణ్యాలు (లైఫ్ స్కిల్స్) అభివృద్ధి చేసుకోవడం ఎంతో ముఖ్యమని చెప్పారు. “ప్రస్తుత కాలంలో ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సంభాషణా నైపుణ్యం, మానసిక స్థైర్యం పెంపొందించుకోవడం, ద్వారా సమాజంలో ఒక సమగ్ర వ్యక్తిత్వాన్ని పొందగలరు” అని అన్నారు.రసాయనశాస్త్ర విభాగాధిపతి, రఘునాథ్ ఈ సర్టిఫికేట్ కోర్స్ వివరాలను తెలియజేస్తూ.., గత 30 రోజులలో విద్యార్థులకు, లీడర్షిప్ క్వాలిటీస్ వ్యక్తిత్వ అభివృద్ధి ఆస్థానంగా యోగ కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ స్ట్రెస్ మానేజ్మెంట్ వంటి అంశాలపై విస్తృత శిక్షణ అందించామని వివరించారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు తమ జీవితంలో సానుకూల దృక్పథం, వ్యక్తిత్వ వికాసం, సమర్థమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలను అలవరచుకున్నారని తెలిపారు. ఇంగ్లీష్ విభాగాధిపతి డా" రవి కుమార్, డా". ఎం. శంకర్, జూలజీ, విభాగం నుండి డా". కె. సంతోష్ కుమార్, ఫిజిక్స్ విభాగం నుండి శ్రీమతి కె. శ్రావణ్య, డా". పవన్ పాండే, డా". భీమరావు, డా". పి.జి. రెడ్డి డా". నాహేదా, రాజయ్య. రామ్మోహన్. ఉజ్మా. అర్షియా. అబ్దుల్లా. మాజర్.అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ, ఈ శిక్షణ తమలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని కలిగించిందని, భవిష్యత్తులో వ్యక్తిగతంగా మరియు వృత్తిపరంగా ఎదగడానికి ఉపయుక్తమని తెలిపారు. అనంతరం పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

# ప్రతి పెడోడికి నాణ్యమైన ఉచిత బియ్యం పారదర్శకంగా అందాలి



**తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు**

**చట్టం మెదక్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, సభ్యురాలు భూక్యా జ్యోతి, ఇతర సభ్యులునర్సాపూర్ పట్టణంలో సరసమైన ధరల దుకాణం పరిశీలన అనంతరం, నర్సాపూర్ పట్టణంలోని MLS పాయింట్ రెడ్డిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాలలో మధ్యన భోజనంలో నాణ్యత సరిగా లేదని నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి సంజాయిషి ఇవ్వాలని డి ,ఈ, ఓ ను ఆదేశించారు. భద్రత, నాణ్యత, ప్రారంభ నిల్వలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలను వారు పరిశీలించారు. MLS పాయింట్ వద్ద, రేషన్ డీలర్లకు న్యాయం జరిగేలా చూసుకోవడానికి రేషన్ బియ్యాన్ని బ్యాగుల లెక్కింపు ఆధారంగా కాకుండా ఖచ్చితమైన బరువు ఆధారంగా పంపిణీ చేయాలని ఆయన నొక్కి చెప్పారు. ప్రతి పేదోడి కడుపు నింపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని సరఫరా చేస్తుందని దాన్ని క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికి పారదర్శకంగా సరఫరా చేసే విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు వివరించారు.ప్రతి పేదోడికి రేషన్ బియ్యం అందాలి బియ్యం నాణ్యత బియ్యం సరఫరా రేషన్ కార్డుల వివరాలు తెలుసుకున్నారు. ప్రతి రేషన్ షాప్ లో వస్తువుల నిల్వ, పంపిణీ నమోదు పద్ధతులు, కార్డుదారులకు సరైన విధంగా సరుకులు అందిస్తున్నారా అన్న అంశాలను పరిశీలించారు. MLS పాయింట్లు లో రేషన్ బియ్యం, డీలర్లు ప్రవర్తన, లబ్దిదారులకు పంపిణీ చట్టబద్ధత అంశాల్లో తనిఖీలు నిర్వహించారు. .అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు పోషకాహారం, అభివృద్ధి సేవలు, నాణ్యత ప్రమాణాలు పరిశీలించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమం, విద్యా వసతులు, పిల్లల హాజరు, ఏర్పాటు, నిర్వహణను తనిఖీ చేసి ప్రత్యక్షంగా అధికారులకు సూచనలు చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పారదర్శకంగా నడిపించాలి, లబ్ధిదారులకు పూర్తిగా వర్తింపజేయాలన్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజన క్రమంగా, నాణ్యతతో అందించాలి.జిల్లా అధికారులతో పాటు సంబంధిత శాఖల సమన్వయం ఉండేలా సూచనలు ఇచ్చారు. ఫుడ్ కమిషన్ చైర్మన్, సభ్యుల వెంట డి ఈ ఓ రాధకిషన్, బి డబ్ల్యు ఓ హేమ భార్గవి, సివిల్ సప్లై అధికారి నిత్యానంద, నర్సాపూర్ ఆర్డిఓ మైపాల్ రెడ్డి, డి ఆర్ డి ఏ పి డి శ్రీనివాసరావు,తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

- ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,సభ్యులు



**చట్టం మెదక్ ప్రతినిధి :** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆశ్రమ పాఠశాల కౌడిపల్లి ని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు,విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. తల్లి తండు)లతో సమావేశం నిర్వహించాలన్నారు. విద్యార్థులకు మాసహారం ,చికెన్ పెట్టడం లేదని చెప్పారని, ప్రభుత్వం విద్యార్థులకు అన్ని విధాలుగా నాణ్యమయిన బోజనానికి కట్టుబడి ఉందన్నారు. ప్రతి విద్యార్థికి ఆహారం తినే హక్కు రాజ్యాంగం కల్పించిందని, విద్యార్థులను నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు తప్పవని తీవ్రంగా హెచ్చరించారు. ఫుడ్ కమిషన్ చైర్మన్, సభ్యుల వెంట డి ఈ ఓ రాధకిషన్, బి డబ్ల్యు ఓ హేమ భార్గవి, సివిల్ సప్లై అధికారి నిత్యానంద, నర్సాపూర్ ఆర్డిఓ మైపాల్ రెడ్డి, డి ఆర్ డి ఏ పి డి శ్రీనివాసరావు, తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# కబడ్డీ ఛాంపియన్ కేజీబీవీ



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ పోలీస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 01 నుండి03 వరకు ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడ మైదానంలో జరిగిన ఉమ్మడి ఆర్మూర్ మండల క్రీడా పోటీలలో కేజీబీవీ ఆర్మూర్ పాఠశాల విద్యార్థులు బాలికల విభాగంలో కబడ్డీలో విజయం సాధించి టోర్నీ బాలికల కబడ్డీ ఛాంపియన్ గా నిలిచి జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య ఐపీఎస్, చేతుల మీదుగా ట్రోఫీ, బంగారు పతకాలు అందుకన్నారు. కల్చరల్ ఆక్టివిటీస్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి షీల్డ్ ని అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు క్రీడాకారులను అభినందించారు.

# ఘనంగా భీమన్న దేవుని గదల ఊరేగింపు



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో మంగళవారం రోజు ఆదివాసి నాయకపోడ్ కులస్తులు ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో నిర్వహించే వారి కుల దైవం భీమన్న దేవుని కళ్యాణం కార్తీక పౌర్ణమి రోజు నిర్వహిస్తారు. నేడు భీమన్న దేవుని గదలను వదలను గ్రామ పురవీధులలో సంఘ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, పిల్లాపాపలతో కలిసి ఊరేగింపు కార్యక్రమంలో భాగంగా నాయకపోడ్ కులస్తులు దేవుని గదలను కులస్తుల ఇళ్లల్లోకి తీసుకువెళ్ళి, అనంతరం బాల్కొండ మండలంలో గల నాగపూర్ గ్రామ శివారులో ఉన్న గోదావరి నదిలో కార్తీక పౌర్ణమి సందర్భంగా గదలను జలాభిషేకం చేయించారు. ఈ కార్యక్రమంలో కులస్తులు వారి కుటుంబ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

# జాతరకు స్పెషల్ బస్సులు



**చట్టం ఆర్మూర్:** తెలంగాణా రాష్ట్రా రోడ్డు రవాణా సంస్థ ఆర్మూర్ డిపో నుండి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి లింబాద్రి గుట్ట జాతరకు ప్రత్యేక బస్ లు తేదీ 05/11/2025 నుండి 07/11/2025 వరకు మూడు రోజులు నడుపనున్నట్లు ఆర్మూర్ డిపో మేనేజర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. చార్జీలు పెద్దలకు 60రూపాయలు, పిల్లలకు 40రూపాయలు, కావున ఆర్మూర్ పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఇట్టి జాతరను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.

# అంబేద్కర్ విగ్రహం పున స్థాపనపై అధికారుల సమావేశం



**చట్టం, నసురుల్లాబాద్:** కామారెడ్డి జిల్లా నస్రులాబాద్ మండలంలోని అంకోల్ క్యాంప్ గ్రామంలో నేషనల్ హైవే - 765D రోడ్డు విస్తరణ పనుల ప్రభావం వల్ల తొలగించాల్సిన డా.బి. ఆర్. అంబేద్కర్ విగ్రహం పునఃస్థాపన విషయమై నేడు ఒక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బాన్సువాడ సబ్ కలెక్టర్ డా. కొప్పిశెట్టి కిరణ్మయి అధ్యక్షత నిర్వహించారు. అలాగే అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, డీఎస్పీ విఠల్ రెడ్డి, తహసీల్దార్ కె. సువర్ణ, మాజీ సర్పంచ్ రాము, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు రాజు, గ్రామ పెద్దలు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో రోడ్డు విస్తరణ కారణంగా విగ్రహం తొలగించాల్సిన పరిస్థితులు వివరించబడగా, గ్రామ ప్రజల అభిప్రాయాలను సేకరించారు. గ్రామంలో విగ్రహం పునఃస్థాపనకు అనువైన ప్రత్యామ్నాయ స్థలాన్ని కూడా గుర్తించారు. అధికారులు గ్రామ పెద్దలతో చర్చించి అంబేద్కర్ విగ్రహాన్ని గౌరవప్రదంగా కొత్త స్థలంలో ప్రతిష్ఠించడానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో ప్రజలు కూడా సహకరించనున్నట్లు హామీ ఇచ్చారు. అధికారులు సమన్వయంతో విగ్రహ పునఃస్థాపన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు,

# యాంకర్ శ్యామలకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన సినీనటుడు గుండు రవితేజ



**చట్టం సిద్ధిపేట ప్రతినిధి :** ప్రముఖ యాంకర్ శ్యామల జన్మదినము సందర్భంగా మంగళవారం హైదరాబాద్ లోని ఆమె నివాసంలో సినీనటుడు గుండు రవితేజ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమెకు గొల్లభామ శాలువా కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పడం జరిగిందని రవితేజ తెలిపారు. ఈ కార్యక్రమంలో బింగి సాయికుమార్, దిలీప్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజ్ రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలి

- ప్రైవేటు విద్యాసంస్థల బంద్‌కు స్పందించని ప్రభుత్వం
- ప్రైవేట్ కాలేజీ విద్యార్థులు ఇంటి బాట
- విద్యార్థులు భవిష్యత్తును దెబ్బతీస్తున్న ప్రభుత్వం
- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల రవీందర్.




**చట్టం భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి :** భద్రాచల పట్టణం లో ప్రైవేట్ విద్యాసంస్థలు, రాష్ట్రవ్యాప్త బందులో భాగంగా భద్రాచలంలో కూడా బందు చేయడం జరిగినది. ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ బకాయిలను విడుదల చేయాలని లేనియెడల మంత్రుల ఇళ్లను ఎమ్మెల్యేల ఇల్లను ముట్టడిస్తామని sfi జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల రవీందర్ హెచ్చరించారు. ప్రైవేట్ విద్యా సంస్థలు బంద్ చేయటం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థులకు న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని ఆయన అన్నారు. గత ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వం కూడా విద్య వ్యతిరేక దిశగా తీసుకెళ్తుందని అన్నారు. ప్రైవేటు యాజమాన్యాలకు ఇచ్చినటువంటి టోకెన్ల నిధులు కూడా ఇవ్వలేదని కాలేజీ యాజమాన్యాలు అందోలనకు దిగాయని, దీని వల్ల విద్యార్థులు చాలా నష్టపోతారని. ఆవేదన వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోక పోవడం వలన మరో మార్గం లేక సమ్మెలోకి దిగిన ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ అడిగితే ప్రభుత్వం విజిలెన్స్ దాడులు చేస్తుందని అన్నారు. పేద విద్యార్థులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం విజిలెన్స్ పేరుతో బెదిరించడం సరికాదు ఫీజు రీయింబర్స్మెంట్ నిధులను దుర్వినియోగం చేసామని ప్రభుత్వం భావిస్తే దానికి కారణం కాలేజీ యజమాన్యాలు కాదు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన తహసిల్దార్లే కారణం ప్రభుత్వం వారిని కూడా బాధ్యులను చేయాలని కొప్పుల రవీందర్ డిమాండ్ చేశారు. సిబ్బందికి జీతాలు కూడా ఇచ్చుకోలేని దుస్థితిలో విద్యా సంస్థల యాజమాన్యాలు ఉన్నాయని అలాంటి పరిస్థితుల్లో న్యాయమైన విద్య ఎలా సాధ్యమని ప్రశ్నించారు కొత్త ప్రభుత్వం ఏర్పడడానికి రెండేళ్ల పాటు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఓపిక పట్టమని చెప్పారు కాలేజీ యజమానులకు ఇది జీవన్మరణ సమస్య అని అన్నిటికి సిద్ధమయ్యే సమ్మెకు దిగామని పేర్కొన్నారు. స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి అని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చినట్టుగా తక్షణమే 12 వేల కోట్లు నిధులను విడుదల చేయాలి. విద్యార్థులు ఎస్ఎఫ్ఐ తో కలిసి పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థులు సాయి, సురేష్, దీపక్, వెంకట్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంపిడిఓ ను మర్యాదపూర్వకంగా కలిసిన గంగారం ఎంప్లాయిస్ & గ్రాడ్యుయేట్ కమిటీ సభ్యులు



**చట్టం గంగారం:** మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం నూతన ఎంపిడిఓ గా భాద్యతలు స్వీకరించిన డి.వైష్ణవి మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం పలుకుతూ పూలబొక్కే అందించి శాలువ కప్పి పరిచయం చేసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ గ్రాడ్యుయేట్ కమిటీ అధ్యక్షులు జె.రాము గౌరవ అధ్యక్షులు మొల్కం వీరస్వామి ప్రచార కమిటీ సభ్యులు ఎదళ్ళపెల్లి శంకర్.మెంతినీ సురేష్ మోకాళ్ల ప్రశాంత్.రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

## చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** జన విజ్ఞాన వేదిక జయ శంకర్ భూపాలపల్లి శాఖా ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్ ను జిల్లా విద్యాశాఖధికారి M. రాజేందర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పొగాకుల రాధాకృష్ణ, వేల్పుల రాజు టెస్ట్ వివరాలు తెలియజేస్తూ, పాఠశాల స్థాయి టాలెంట్ టెస్ట్ నవంబర్ 7,మండలం స్థాయి నవంబర్ 21,. జిల్లా స్థాయి 28 న నిర్వహించడం జరుగుతుంది. భూపాలపల్లి జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలోని 8,9,10 తరగతి చదివే విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలనీ పిలుపు నిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి, పి ఆర్ టీ యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సుభాకర్ రెడ్డి. కిరణ్ కుమార్, CMO, రమేష్, ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజగోపాల్, జి సి డి ఓ శైలజ, విజయపాల్ రెడ్డి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## యూసఫ్ గూడా లో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ప్రచారం



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా యూసఫ్ గూడ లో మైనారిటీ నాయకులతో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మంగళవారం సమావేశం నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల ప్రచారంలో అనూహ్య స్పందన లభించింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గుర్తు చేతి గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి నవీన్ యాదవ్ ని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ సమావేశం నిర్వహించడం జరిగింది. తమ ఓటు తప్పకుండా నవీన్ యాదవ్ కే ఓటు వేసి తమ నియోజకవర్గం అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం చేస్తున్న విద్యుత్ అధికారులు



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లి ఎస్ ఎస్ వన్ ట్రాన్స్ఫరము ఎల్లారెడ్డిపల్లె కు వచ్చే 6,3, 11 కెవి విద్యుత్ ఎల్ టి లైన్ సరఫరా వచ్చే మెయిన్ రోడ్డు ఎర్ర కొమరయ్య ఇంటి వద్దన విద్యుత్తు తీగలు చెట్టుకు అలుముకొని ప్రమాదకరంగా ఉన్నందువలన ఇప్పుడున్న పరిస్థితుల్లో గాలికి కరెంటు వైర్లు తెగితే ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందువలన ఇట్టి సమాచారాన్ని విద్యుత్ అధికారులైన, ఏఈ కి తెలియజేసినప్పటికి, నిర్లక్ష్యం వహిస్తునందుకు ఇట్టి ప్రమాదం జరుగితే విద్యుత్ శాఖ బాధ్యత వహించాలని , వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదం నివారించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఫీజులు మాత్రం వేలకు వేలు, ప్రమాదంలో స్కూల్ పిల్లల ప్రాణాలు




**చట్టం రామగుండం :** గోదావరిఖనిలోని ఇంటర్నేషనల్ రావుస్ స్కూల్ వ్యాన్ వెనుక అద్దం లేని దృశ్యం. పేరుకే కార్పొరేట్ స్కూల్ ఫీజులు మాత్రం వేలకు వేలు, లక్షలకు లక్షలకు వసూలు.. ఈ వ్యవహారం అంతా సంబంధిత అధికారులకు తెలిసిన చూసి చూడనట్టుగా వుంటున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే, చిన్నపిల్లల ప్రాణాలు పోతే, అప్పుడు ఎక్స్ గ్రేషియా ఇవ్వడానికి మాత్రం ముందుకు వస్తారు.దీనిని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండ్ల రాకేష్ తీవ్రంగా ఖండిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు దీనిపై దృష్టి పెట్టి అట్టి వ్యాన్లను సీజ్ చేయాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని రాకేష్ హెచ్చరించారు.

## విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా పోరాడుదాం పిడిఎస్యు




**చట్టం ధర్పల్లి;** రోజురోజుకీ విద్య వ్యాపారంగా తయారైందని, కార్పోరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుండి అత్యధికంగా ఫీజులు వసూలు చేస్తూ వ్యాపారానికి ఊతమిస్తున్నారని పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు ఆర్ .గౌతమ్ కుమార్ ఆరోపించారు. మంగళవారం ధర్పల్లి మండల కేంద్రంలో ఆర్మూర్ డివిజన్ మహాసభ ను విద్యార్థులతో కలిసి నిర్వహించారు. దీంట్లో భాగంగా విద్యార్థుల సమస్యను ఎకరువ్వు పెట్టారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 15% బడ్జెట్ను విద్యకు అందించాలనే హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందని 7 శాతం నిధులతో సరి పెట్టుకుందని విమర్శించారు. 9000 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ విద్యార్థుల స్కాలర్షిప్ తదితర వాటివి గత నాలుగు సంవత్సరాలుగా చెల్లించలేదని గుర్తు చేశారు. కార్పోరేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వమే ఊతమిస్తుంది అన్నారు. వెంటనే ప్రభుత్వ విద్యాలయాల్లో వసతులను కల్పించి ,విద్యార్థులకు స్కాలర్షిప్ లో ఫీజు రియంబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు నాయకులు వీ. బాలయ్య హనుమంత్ రెడ్డి, హుస్సేన్, రెహమాను, గణేష్ ,సాయి, తదితరులు పాల్గొన్నారు.

## నిలువ నీడలేని శ్రీనుకు అండగా నిలుద్దాం మనసుంటే మారిపోతుంది జీవితం!



**ఎల్లారెడ్డి, చట్టం ప్రతినిధి:** ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండాకు చెందిన యువకుడు ఆంగోత్ శ్రీను (20) జీవితం ఒక కఠిన పరీక్షలో నిలిచిపోయింది. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఈ యువకుడు ప్రస్తుతం నిలువ నీడలేని స్థితిలో ఉన్నాడు. ఫారెస్ట్ భూమిలో చిన్న గుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్న శ్రీను, ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన ఆ గుడిసె పూర్తిగా కూలిపోవడంతో తలదాచుకునే చోటును కూడా కోల్పోయాడు. ఇద్దరు చిన్న పిల్లలతో కడుపు నింపుకునే కష్టంలో ఉన్న శ్రీను ప్రస్తుతం హాజీపూర్ తండాలోని DNT ప్రాథమిక పాఠశాలలో తాత్కాలికంగా తలదాచుకుంటున్నాడు. తినడానికి తిండి లేదు, ఉండడానికి ఇల్లు లేదు అయినా జీవితం మీద ఆశను కోల్పోకుండా ధైర్యంగా పోరాటం కొనసాగిస్తున్నాడు. ఈ పరిస్థితిని గమనించిన గ్రామస్తులు, యువకులు శ్రీను కుటుంబానికి సహాయం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా దాతలు, రాజకీయ నాయకులు, సేవాసంస్థలు ఈ నిరుపేద కుటుంబానికి అండగా నిలబడాలని కోరుతున్నారు. చిన్న సహాయం కూడా ఈ కుటుంబానికి ఒక కొత్త ఆశాకిరణం అవుతుంది.

**సహాయం అందించదలచిన వారు:**

PhonePe నెంబర్: 9618796475 — మాలోత్ గణేష్ నాయక్ (బంజారా యూత్ అధ్యక్షులు)

PhonePe నెంబర్: 9440870497 — సర్దార్ నాయక్ (AIBSS ప్రధాన కార్యదర్శి)

మనసుంటే మారిపోతుంది మనిషి జీవితం — మీ చిన్న సహాయం శ్రీనుకు కొత్త బతుకుబాటగా మారుతుంది.

## భూసార పరీక్ష విశ్లేషణ పత్రాల పంపిణీ : ఏవో భరత్ కుమార్



చట్టం నార్సింగి : మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రంలో నార్సింగి రైతు వేదికలో నిర్వహణ ఈ రోజు నార్సింగి రైతు వేదికలో రామాయంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ నారాయణ రైతులకు సాయిల్ హెల్త్ కార్డ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాయిల్ హెల్త్ కార్డుల ద్వారా నేలలో ఉన్న పోషకాల స్థితి, అలాగే సాగుచేసే పంటలకు అవసరమైన ఎరువుల పరిమాణాన్ని రైతులు సక్రమంగా తెలుసుకోవచ్చని తెలిపారు. సాయిల్ హెల్త్ కార్డ్ సూచనల ప్రకారం ఎరువులు వేసుకోవడం ద్వారా భూసారం పెంచుకోవడంతో పాటు పెట్టుబడి తగ్గించుకోవచ్చు, దిగుబడి పెంచుకోవచ్చని వివరించారు. అలాగే చౌడు గల భూములకు ఎకరానికి 200 కిలోల జిప్సమ్ వాడితే చౌడు తగ్గి నేల ఉత్పాదకత పెరుగుతుందని సూచించారు.జిల్లా ఉద్యానవన అధికారి ప్రతాప్ సింగ్ ఆయిల్ పామ్ సాగు మరియు అందుబాటులో ఉన్న సబ్సిడీల వివరాలను రైతులకు తెలియజేశారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని, ఆయిల్ పామ్ మొక్కలు మరియు డ్రిప్ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భరత్‌కుమార్, విస్తరణ అధికారి నీ విజృంభణ, లివ్ పామ్ మేనేజర్ ప్రశాంత్, మంజీరా FPC చెర్మెన్ నర్సింహ రెడ్డి తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## రహదారులపై మృత్యుఘోషకు అంతం లేదా

- బి కే యం యు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** పది రోజుల క్రితం కర్నూలు సమీపంలో ప్రైవేటు బస్సు దగ్ధమై 19 మంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటన మరువక ముందే సోమవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ ప్రాంతంలో కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీ కొనడం ఘోర ప్రమాదంలో టిప్పర్ ,బస్సు డ్రైవర్స్ తో సహా 19 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయి అనేకమంది క్షతగాత్రులు కావడం అత్యంత బాధాకరమని, మృతులకు సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటి పాముల వెంకట్రాములు ప్రకటించారు. హైదరాబాద్ బీజాపూర్ హైవేపై తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగి మూడేళ్లలో 135 మందికి పైగా మరణించినట్లు తెలుస్తుందని, రోడ్డు విస్తరణ పనులకు టెండర్లు పూర్తయిన పనులు జరగడంలో జాప్యం వలన ఈ హైవేపై ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయన్నారు. కంకర టిప్పర్ డ్రైవర్ అతివేగం ప్రమాదానికి కారణమని ఆర్టీసీ ఎండి ప్రకటించడం జరిగిందన్నారు. బస్సులో నిబంధనలకు విరుద్ధంగా డెబ్బై మంది ప్రయాణించడం, రోడ్డు రవాణా శాఖ అధికారుల అవినీతి నిబంధనలను ఉల్లంఘించిన వాహనాలను రోడ్లపై తిరగడానికి అనుమతించడం, మన రవాణా వ్యవస్థలోని లోపాలే నిండు ప్రాణాలను బలి గొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి విషాదాలు పునరావృత్తం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు రూ.1 కోటి ఎక్స్ గ్రేషియో, క్షతగాత్రులకు 5 లక్షల రూపాయలు చెల్లించాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 6న బాసరలో పాదుకదర్శన వేడుక




**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలో 6న గురువారం పాదుక దర్శన కార్యక్రమం ఉంటుందని రామానందచార్య సాంప్రదాయ సేవ సమితి నిర్మల్ జిల్లా కమిటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీ శ్రీ శ్రీ జగద్గురు నరేంద్ర స్వామి నేతృత్వంలో జరుగుతున్న ఈ యొక్క కార్యక్రమం పవిత్ర పుణ్యక్షేత్రం తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రంలో జీఎస్ గార్డెన్ లో గురువారం ఈ కార్యక్రమం ఉంటుందని గురువారం గ్రామంలో శోబ యాత్ర బస్టాండ్ నుండి పురవీధుల గుండా సిద్ధ పాదుక సామాజిక కార్యక్రమంలో భాగంగా భాజా భజంత్రీలు మధ్య ఆటపాటలతో చేపట్టగా అనంతరం సామాజిక కార్యక్రమంలో భాగంగా ఉపాసిక మహిళ భక్తులకు ఏడుగురుకు ఉచితంగా ట్రస్ట్ నుండి కుట్టుమిషన్లు ప్రధానం చేయడం జరుగుతుందని,అదేవిధంగా ప్రవచనం కర్తలు, పాండురంగ నానజ్ అనంతరం సిద్ధిపాదుక దర్శనం ఉదయం తొమ్మిది నుండి ఆరు గంటల వరకు ఉంటుందని, ఈ కార్యక్రమానికి మన రాష్ట్రం నుండే కాకుండా కర్ణాటక మహారాష్ట్ర నుండి పదివేల మంది భక్తులు పాల్గొంటారని, ప్రవచన దర్శన అనంతరం భక్తులకు ఉచిత మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని,ఈ కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## బీఎస్పీ సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా కొండపలకల సంపత్



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడపట్ల ఈశ్వర్ ఆదేశాలనుసారం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ నంగునూరు మండలం దర్గపల్లి గ్రామానికి చెందిన కొండపలకల సంపత్ కు నియామక పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బహుజన వాదాన్ని గ్రామ గ్రామాన పరిచయం చేస్తూ మహాత్మా పూలే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాన్సీరామ్ పని విధానంతో పార్టీని గ్రామ గ్రామాన విస్తరిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు తన నియామకం కోసం సహకరించిన పార్టీ నాయకులకు పేరుపేరునా ధన్యవాదాలు ఈ సందర్భంగా సంపత్ తెలియజేశారు. దీనియమకంతో పార్టీలో తనపై బాధ్యత మరింత పెరిగిందని ఆయన తెలిపారు.

## జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు జూనియర్ కళాశాల విద్యార్థి



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్)లో మొదటి సంవత్సరం చదువుతున్న బరిగే కావ్య జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ లో నిర్వహించిన అండర్ 18 మాస్టర్ విభాగంలో గోల్డ్ మెడల్, టైం ట్రావెల్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి బేష్ అనిపించుకుంది. నవంబర్ 15న ఒడిశాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో కావ్యను శాలువాతో సత్కరించి, అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కావ్య పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగుతుందని జాతీయస్థాయిలో రాణించి మరిన్ని మెడల్స్ సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిన్న కోడూరు కళాశాల ప్రిన్సిపాల్ కూచంగారి శ్రీనివాస్, కళాశాల ఏజీఎంసి దేవయ్య, స్టాఫ్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, స్టూడెంట్ కౌన్సిలర్ కనక చంద్రం, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నంట శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దరిపల్లి నగేష్, స్పోర్ట్ ఇంచార్జి అశోక్, కోచ్ వెంకటేష్, అధ్యాపకులు వెంకటరమణ, రఘురాజ్, శ్రీకాంత్, నరేందర్ రెడ్డి, బేతి శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ రావు ని పరామర్శించిన ముదిరాజులు



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట రూరల్ మండలం సీతారాం పల్లి గ్రామ ముదిరాజులు సిద్దిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే హరీష్ రావు తండ్రి ఇటీవల మరణించినందున వారిని హైదరాబాదులో కోకాపేటలో వారి నివాసంలో వారి తండ్రి చిత్రపటానికి నివాళులు అర్పించి హరీష్‌రావు ని పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గొప్ప నేతగా పేరుగాంచిన నేత హరీష్ రావు అని కొనీయాడుతూ వారు నిత్యం ప్రజలే సమాజమే కుటుంబంగా భావించి రాగద్వేషాలు లేకుండా ప్రతి ఒక్కరికి సహాయం అందించారు ఈ ఈ కష్టకాలంలో మేమంతా వారి వెంట ఉంటామని అన్నారు భవిష్యత్తులో కూడా హరీష్ రావు కి వెన్నంటే ఉండి వారి కోసం పని చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సీతారాం పల్లి గ్రామం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పడిగే ప్రశాంత్. పడిగే బాలకిషన్.రెడ్డి లింగం. పడిగే బలమల్లు. పడిగే పరమేశ్వర్.తోటి స్వామి. పడిగే రాజయ్య. పడిగే యాదగిరి. పడిగే స్వామి. పడిగే రాజు. పడిగే రాకేష్. పడిగే హరిదాసు లు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్‌లో విమానాశ్రయ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఆమోదం



**చట్టం రామాయంపేట :** ఆదిలాబాద్‌లో విమానాశ్రయ అభివృద్ధికి రాష్ట్ర సర్కార్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సమర్పించిన నివేదిక ఆధారంగా, ప్రభుత్వం ఆదిలాబాద్ కలెక్టర్‌ను భూసేకరణ ప్రారంభించాలని ఆదేశించింది. ఈ ప్రాజెక్ట్ ఉత్తర తెలంగాణలో కనెక్టివిటీని మెరుగుపరచడంతో పాటు పర్యాటకాన్ని, పారిశ్రామిక వృద్ధిని పెంచుతుందని అధికారులు తెలిపారు. విమానాశ్రయంలో 3 కి.మీ రన్‌వే, పౌర టెర్మినల్, భారత వైమానిక దళం స్టేషన్ ఉంటాయి.

## యువకుడు పై వీధి కుక్క దాడి తీవ్ర గాయాలు



**చట్టం నార్సింగి :** మెదక్ జిల్లా నార్సింగి మండలనికి చెందిన కూరాకుల నందకిషోర్ ఇంటి వద్ద నుండి తన ఫ్రెండు వద్దకు వెళ్లి నోట్బుక్ తీసుకొని వస్తున్న క్రమంలో ఎస్బిఐ సర్వీస్ రోడ్డు బ్యాంక్ ప్రక్కన వీధి కుక్క అకస్మకంగా అతనిపై దాడి చేయగా చేతికి గాయాలయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం యువకుడి పరిస్థితి స్థిరంగా ఉందని తల్లిదండ్రులు అన్నారు. గ్రామంలో మరో ఇద్దరిని కుక్క కరిచినట్లు సమాచారం ఉంది అన్నారు. పిల్లలు బయటకు వెళ్లాలంటే భయాందోళన గురవుతున్నారు. వెంటనే పై అధికారులు స్పందించి కుక్కలను పట్టి పట్టణానికి దూరంగా వదిలిపెట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## సలహాదారుగా నియామకం అభినందనలు తెలిపిన కాంగ్రెస్ నేతలు



**చట్టం న్యూస్ బాన్సువాడ :** బోధన్ ఎమ్మెల్యే పెద్దలు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సలహాదారుగా (కేబినెట్ హోదా) నియమితులైన సందర్భంగా, పిసిసి డెలిగేట్ డా. కూనీపూర్ రాజారెడ్డి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై సమీక్షించే అధికారం కల్పించినందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హంధాన్, నాయకుడు గజ్జెల సాయులు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్కన్నపేట్లో ఉచిత మెగా వైద్య శిబిరం



**చట్టం రామాయంపేట :** మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామం లో ఈరోజు బీసీ కాలనీలో భారీ ఎత్తున రోగులు రాగా ఆయనే స్వతగా ప్రతి రోగికి దగ్గరగా తీసుకొని ఆయన వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులు అవసరం నిమిత్తం ఇచ్చాడు ఆయన పరీక్ష చేసిన వారిలో 600 పైగా రోగులు ఉన్నట్లు ఆయన తెలిపారు. దగ్గు, జ్వరము, బిపి, షుగర్, కీళ్ల నొప్పులు, సర్ది పలు రకాల వ్యాధులు గల రోగులు వచ్చారని వారికి తగిన మందులు ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపయ్య గారి ఎల్లం తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు. లీలా గ్రూప్ చైర్మన్ తో సహా, లీలా గ్రూప్ సభ్యుడు అయిన సౌమ్య , తారా సింగ్ తదితరులు హాజరైనారు.

## మాజీ మంత్రిని కలిసిన ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



**చట్టం, భైంసా :** మాజీ మంత్రి తన్నీరు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావును మంగళవారం పరామర్శించిన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పరామర్శించారు. హరీష్‌రావు, తండ్రి తన్నీరు సత్యనారాయణ మరణించడంతో హైదరాబాద్ లోని వారి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇలాంటి కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని, సత్యనారాయణ, ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. వీరి వెంట లోకేశ్వరం పిఏసిఎస్ చైర్మన్ చిన్నారావు, బాసర మాజీ జెడ్పిటిసి రమేష్, సందీప్ తదితరులున్నారు

# కల్తీ చేసి అమ్ముతున్న పిండి వంట బట్టిలపై పోలీసుల ఉక్కుపాదం

**చట్టం న్యూస్ జహీరాబాద్:** పట్టణంలోని పలు కల్తీ పిండి వంటలు తయారు చేసే కర బట్టిలపై మంగళవారం పోలీసులు ఉక్కుపాదం మోపారు. అదేవిధంగా ఎలాంటి ఫైర్ సేఫ్టీ నియమాలు మరియు శుభ్రతలు పాటించకుండ కొంత మంది పని మనిషులతో పని చేపిస్తూ పాడైన ఆహార పదార్థాలను వాడుచుతు , కల్తి చేస్తు, పిండి వంటలు తయ్యారు చేపిస్తున్న వారిపై కేసులు నమెదు చేయడం జరిగింది.అంతేకాకుండా జహీరాబాద్ పరిధిలో కార తాయారు చేసే స్థావరంపై దాడి చేసి వారి వద్ద నుండి కార పదార్థాలను మరియు కారా తయారికి వాడే మెటీరియల్ ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు, జహీరాబాద్ టౌన్ సబ్ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. వినయ్ కుమార్, చిరాగ్ పల్లి ఎస్సై రాజేంద్రర్ రెడ్డి, మరియు యస్ఐ సంగమేశ్వర్, తమ సిబ్బందితో కలిసి ప్రగతి నగర్ కాలనీ లోని పారాస్ కార తయారి కేంద్రం, మరియు హమాలి కాలనీ లోని అభినయ శ్రీ స్పెషల్ కార తయారి కేంద్రాలలో ఎలాంటి ఫైర్ సేఫ్టీ నియమాలు మరియు శుభ్రతలు పాటించకుండ కొంత మంది పని మనిషులతో వేళపల్లం లేకుండా పని చేపిస్తూ కల్తీ ఆహార పదార్థాలను వాడుతూ , పిండి వంటలు తయ్యారు చేయిస్తూ కనిపించిన్నారు. అలాగే అట్టి పదార్థాలను జహీరాబాద్ పరిసర ప్రాంతాలలో అమ్ముతూ చాల మంది అనారోగ్యానికి బారిన పడే విధంగా చేస్తున్నారు. కావున పైన తెలిపిన పారస్ కార తయారి పారస్నాథ్ తండ్రి పేరు రఘునాథ్, మరియు అభినయ శ్రీ స్పెషల్ కార తయారి యజమాని అయిన పేరుమల్ తండ్రి పేరు తనికుడ లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు..



## కార్తీక పౌర్ణమి సందర్భంగా రామప్పగుట్ట పై ప్రత్యేక పూజలకు భారీ ఏర్పాట్లు



**చట్టం, తూప్రాన్;** రామప్ప గుట్ట పై కార్తీక దీపోత్సవం జ్వాలా తోరణం ప్రత్యేక పూజలకు భారీ ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తూప్రాన్ మండలం జేజపట్నం ఇస్లాంపూర్ రామప్ప గుట్ట పై ఘనంగా కార్తీక పూర్ణమి పురస్కరించుకొని బుధవారం సాయంత్రం కార్తీక దీపోత్సవం, శ్రీ భవాని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు, జ్వాలా తోరణం, స్వామివారి సేవా ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మ కర్తలు, ఆలయ పూజారి సలాక ఆత్రేయ శర్మ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీ భవాని సమేత రామలింగేశ్వర స్వామి కృపా కటాక్షములు పొందాలని వారు కోరారు.

## సెంటర్ లైటింగ్ పనులు పరిశీలించిన ఆర్ అండ్ బి శాఖ ఈఈ



**చట్టం బిచ్కుంద;** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులను మంగళవారం నాడు ఆర్ అండ్ బి శాఖ ఈ ఈ మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్టర్ ను సెంట్రల్ లైటింగ్ పనులు తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్తు స్తంభాలు, మిషన్ భగీరథ, ఓ ఎఫ్ సి లైన్ ఉండటంవల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాంట్రాక్టర్ సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి ఈ వినోద్, ఏఈ భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

## సెంటర్ లైటింగ్ పనులు పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



**చట్టం బిచ్కుంద;** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులను మంగళవారం నాడు మున్సిపల్ కమిషనర్ షేక్ హయూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్టర్ ను సెంట్రల్ లైటింగ్ పనులు తొందరగా పూర్తి చేయాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ తో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## అక్రమ మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసిన పోలీసులు



**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణ కేంద్రంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై యాయతి రాజు నేతృతంలో పోలీసు సిబ్బంది చర్యలు చేపట్టి ట్రాక్టర్లను సీజ్ చేశారు. పట్టుబడిన వాహనాల పై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా అక్రమ మట్టి రవాణా పై కఠిన చర్యలు కొనసాగిస్తామని ఎస్సై హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సేవలు అభినందనీయం

- **సేవలతో ముందుకు సాగిపోవాలి**
- **మన ప్రాంతం మన అభివృద్ధి**
- **సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండారు శ్రీధర్ రెడ్డి**



**చట్టం, బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో మంగళవారం బిఆర్ఎస్ యువ నేత పిప్పల్ దారి మాజీ సర్పంచ్ బండారి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవలే బోథ్ నుండి పొచ్చేర వరకు గల రోడ్డుపై ముళ్లపొదలను బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో తొలగించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలతో ముందుకు సాగిపోవాలని కోరారు. భవిష్యత్ లో సొసైటీ తో కలిసి బోథ్ ప్రాంత అభివృద్ధి కోసం కలిసి ప్రయాణం చేయడానికి తాము సిద్ధమని తెలిపారు. అనంతరం సొసైటీ సభ్యులైన షేక్ అలీ, దాసరి పురుషోత్తం, అబ్దుల్ రావుఫ్, వెండి పృథ్వి, రమణ గౌడ్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేడి చల్మా ప్రవీణ్, రూప్ చంద్, మాజీ ఉపసర్పంచ్ రవి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణంలో నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : ఎంపీడీవో



**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో ఎంపీడీవో అప్పారావు మంగళవారం ఆకస్మికంగా పాత రెడ్డి గూడెం, ఆసుపాక సహా ఐదు పంచాయితీలలో పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అవసరమైతే దిద్దుబాట్లు చేయాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు వేగవంతం చేసి, పర్యావరణ సురక్షణ చర్యలు తీసుకోవాలని సిబ్బందికి స్పష్టం చేశారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణ చేసుకోవాలి

- **ఇందిరమ్మ ఇంటి నిర్మాణ చేసుకోవాలని లబ్ధిదారులకు**
- **అవగాహన కల్పించిన మున్సిపల్ కమిషనర్**



**చట్టం బిచ్కుంద;** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండలం గోపనపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకము గురించి మున్సిపల్ కమిషనర్ షేక్ హయుం గ్రామ ప్రజలతో మరియు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన అలబ్ధిదారులతో చర్చించి ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవాలని చెప్పారు . వారితో పాటు గ్రామ పెద్దలు శంకర్ పటేల్ నాగప్ప గ్రామ ప్రజలు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధికి ఆమడ దూరంలో 33వ డివిజన్



- **కనీస సౌకర్యాలు లేక మూతపడిన సింగరేణి సెక్టర్ -2 కమ్యూనిటీ హాల్**
- **ఏండ్లగా ఖాళీగా ఉన్న స్థలంలో కార్మిక కుటుంబాల కోరకు పార్క్ నిర్మించాలి**
- **డివిజన్ లో రోడ్లు చెడిపోయిన చోట నూతన రోడ్లు నిర్మించాలి : మద్దెల దినేష్**
- **ప్రభావిత ప్రాంతమైన 33వ డివిజన్ను సందర్శించిన సింగరేణి అధికారులు**

**చట్టం రామగుండం :** గోదావరిఖనిలోని అర్జీ 1 పరిధిలో ఓసిపీ 5 ప్రభావిత ప్రాంతం అయిన 33వ డివిజన్ సందర్శించాలని జి. ఎం లలిత్ కుమార్ కి ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ కోరగా వారి ఆదేశాల మేరకు మంగళవారం రోజున ఎస్ ఓ టు జి ఎం చంద్రశేఖర్, సివిల్ డిజిఎం వరప్రసాద్, ఎస్ఎస్ం సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి లు వారి క్రింది సిబ్బంది సూపర్వైజర్లు, ఇంజనీర్లు కలసి 33వ డివిజన్ సందర్శించారు.అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ.... ఓసిపి5 ప్రభావిత ప్రాంతమైన 33వ డివిజన్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని కనీసం కార్మికుల కుటుంబాల శుభ కార్యాలు చేసుకుందామన్నా సెక్టర్ 2 కమ్యూనిటీ హాల్ ఉండి లేనట్టు అవుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. కనీస సౌకర్యాలు లేక అనేక సంవత్సరాల నుండి మూత పడిందని దీనివల్ల కార్మిక కుటుంబాలు అనేక రకాలుగా ఆర్థికంగా నష్టపోతున్నారని కావున ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి ఇట్టి కమ్యూనిటి హాల్ ని మినీ బ్యాంకట్ హాల్ గా మార్చాలని దాని ద్వారా సింగరేణికి ఆదాయం ఆదాయయంతో పాటు కార్మికుల కుటుంబాల శుభాకార్యలకు సౌకర్యంగా ఉంటుందని సుమారు పది డివిజన్ల ప్రజలకు ఉపాయోగ పడుతుందని అధికారులకు సూచించడం జరిగిందని పేర్కొన్నారు.అదే విధంగా కమ్యూనిటీ హాల్ ఎదురుంగ ఏండ్ల నుండి ఖాళీ స్థలం ఉన్న ప్రదేశం రోజు రోజుకు అడవిల తయారైతుందని దానిలో పాములు,ఇతర జీవులు చుట్టూ ప్రక్కల ఇండ్లలోకి ప్రవేశించి నాన రకాలుగా ఇబ్బంది పడుతు భయభ్రాంతులకు గురైతున్నారని, కావున సింగరేణి అధికారులు యుద్ధ ప్రతిపాధికన ఖాళీ స్థలంలో కార్మికుల కుటుంబాల సౌకర్యర్థం కొరకు,వారి కుటుంబ సభ్యుల కోసం నూతంగా పార్క్ ఏర్పాటు చేయాలని, ఓపెన్ జిమ్ మంజూరు చేయాలని ప్రజల పక్షాన అధికారులను కోరడం జరిగింది. అదే విధంగా కార్మికుల ఇండ్ల ముందు పూర్తిగా రోడ్లు మొత్తం చెడిపోయాయాయని కావున నూతన రోడ్లు మంజూరు చేయాలని అధికారులను కోరడం జరిగిందని, కావున అధికారులు సానుకూలంగా స్పందించి జిఎం తో చర్చించి త్వరలో ప్రజలకు అనుకూలంగా పనులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు ఎర్రల రాజయ్య, శ్రీనివాస్, ఉదయ్, స్థానిక డివిజన్ పెద్దమనుషులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జీవితంలో గెలవాలంటే క్రమశిక్షణ ముఖ్యం

- **సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి బట్టి చదువులకు స్వాస్తి చెప్పాలి**
- **ఎంపీ మాధవనేని రఘునందన్ రావు**



**చట్టం రామాయంపేట :** యువత గెలవాలంటే క్రమశిక్షణ ముఖ్యమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విద్యార్థులకు తెలియజేశారు. మెదక్ పట్టణంలోని స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లా యువజనోత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామి వివేకనంద చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో గెలవాలంటే క్రమశిక్షణ ఒక్కటే మార్గం అన్నారు. బట్టి చదువులకు స్వాస్తి చెప్పి విశ్లేషణాత్మకంగా చదవాలన్నారు. లక్ష్యం చేరాలంటే సోషల్ మీడియాను దూరంగా ఉంచాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. మహిళా క్రికెట్లో భారత మహిళా జట్టు విజయం సాధించి 140 కోట్ల మంది భారతీయుల అభిమానాన్ని చురగొన్నారని గుర్తు చేశారు. యువతలో గెలుస్తానని తపన ఉండాలన్నారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశ క్రీడల్లో వెనుకంజులో ఉందన్నారు. దాన్ని మరింత ముందుకు తీసుకుపోవడానికి యువకులందరూ కృషి చేయాలి అన్నారు. ప్రతి వ్యక్తిలో యోగా నిత్యజీవితంలో భాగం కావాలన్నారు. యువకులు తల్లిదండ్రులు ఆశయాలని నెరవేరుస్తూ వాళ్ళ లక్ష్యాలను సాధించాలని కోరారు. తెలంగాణ నుంచి నిక్కత్ జరీన్ ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షీల్డ్, ప్రశంసా పత్రం అందించి, శలువతో ఎంపీ రఘు నందన్ రావు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి రమేష్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఉపాధ్యాయులు గడ్డం అశోక్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## లాయర్ రాకేష్ కిషోర్‌పై కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నేతల డిమాండ్



**చట్టం, మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఐబీ గెస్ట్ హౌస్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ బొజ్జ సైదులు మాట్లాడుతూ, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ BR గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన రాజ్యాంగ విలువలకు అవమానం అని పేర్కొంటూ, నవంబర్ 17న జరగనున్న "ఛలో ఢిల్లీ" మహా నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలను పిలుపునిచ్చారు. బొజ్జ సైదులు మాట్లాడుతూ, "దేశభక్తులు ఎవరు, దేశద్రోహులు ఎవరు అనే చర్చ ఈ ఘటనతో దేశవ్యాప్తంగా మొదలైంది. ధర్మం ముసుగులో దాడులు చేస్తే చట్టం ఎందుకు మౌనం పాటిస్తుంది? రాజ్యాంగాన్ని ధిక్కరించే వారిని దేశద్రోహులుగా గుర్తించాలి," అని అన్నారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ BR గవాయ్‌పై బూటుతో దాడి చేసినా, చట్టపరమైన చర్యలు ఇప్పటివరకు తీసుకోకపోవడం ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. "ఢిల్లీలో ఉన్న అత్యున్నత న్యాయస్థాన జడ్జిలకు కూడా దాడులు జరుగుతున్నాయంటే, సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ఢిల్లీ పోలీస్ వ్యవస్థ ఆలోచించాలి," అని అన్నారు. "మమ్మల్ని అంటరానివారిగా చేసినది ఏ ధర్మమో, దానికి సమాధానం కావాలి. కేంద్ర ప్రభుత్వం ఇక మౌనం వీడాలి," అని బొజ్జ సైదులు డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ BR గవాయ్‌పై జరిగిన అమానుష దాడి దేశవ్యాప్తంగా దళిత సమాజాన్ని కలచివేసిందని ఆయన పేర్కొన్నారు. "భారత రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నవారు దేశద్రోహులుగానే పరిగణించాలి. వారిపై దేశద్రోహం కేసులు పెట్టకపోవడం మరొక అన్యాయం," అని అన్నారు. నవంబర్ 17న జరగనున్న "ఛలో ఢిల్లీ" మహా నిరసనలో గ్రామ గ్రామాల నుండి సామాజిక, దళిత సంఘాలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని దళితుల ఆత్మగౌరవాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నవంబర్ 1న హైదరాబాద్‌లో జరిగిన మహా నిరసన విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు అస్తారుగళ్ల బాలరాజ్, జిల్లా ప్రతినిధి మన్నెల్లి సుధాకర్, సీనియర్ నాయకులు దండోలా సామిల్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి మహేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పరమేష్, జిల్లా కార్యదర్శి రాములు, మహిళా అధ్యక్షురాలు మాధవి, వికలాంగుల విహెచ్పిఎస్ అధ్యక్షుడు పాండు, మండల నాయకులు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42%రిజర్వేషన్ను అందించాలి



**చట్టం ధర్పల్లి;** తెలంగాణ రాష్ట్రంలో 65 శాతం జనాభా ఉన్న బీసీలకు విద్య ఉద్యోగ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ను కల్పిస్తూ ,రాజ్యాంగ తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ ,మంగళవారం ధర్మసమాజ్ బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు మహిపాల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఉప తాసిల్దార్ ప్రవీణ్ కుమార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో 15% జనాభా ఉన్న అగ్రవర్ణాల వారు బీసీలను పరిపాలిస్తున్నారని, రాజకీయంగా బీసీలnuu ఎదగనివ్వడం లేదని ఆరోపించారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ను అమలు చేయించాలని సవాలు విసిరారు. ఎన్నికల సమయంలోనే ఓటు బ్యాంకు రాజకీయంగా బీసీలు గుర్తుకు వస్తారని ఎద్దేవా చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో వి. బాలయ్య ప్రసాద్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కౌలాస్ నాలా ప్రాజెక్ట్ నుండి అకస్మాత్తుగా నీరు విడుదల

- **ముందస్తు హెచ్చరిక చెయ్యకపోవడంతో వాగులో చిక్కుకున్న ట్రాక్టర్..**
- **నీటిలో కొట్టుకుపోయిన వరి ధాన్యం**



**చట్టం బిచ్కుంద ;** కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం కౌలాస్ నాల ప్రాజెక్ట్ గేట్ పరిశీలన కోసం అధికారులు మంగళవారం మధ్యాహ్నం ముందస్తు సమాచారం లేకుండ గేట్లు ఎత్తి దిగువన నీటిని విడుదల చేయడం జరిగింది. దిగువన ఉన్న కౌలాసు వాగు పరివాహక ప్రాంతంలో అప్రమత్తం చేయకపోవడంతో బిచ్కుంద మండలం చిన్న దేవాడ గ్రామ వాగులో అకస్మాత్తుగా నీటి ప్రభావం పెరగడంతో అవతల వడ్డు నుంచి దేవాడకు వరి ధాన్యం తీసుకు వస్తున్న ట్రాక్టర్ నీటిలో చిక్కుకున్నది. ట్రాక్టర్ డ్రైవర్ అప్రమత్తంతో ట్రాక్టర్ పైనుంచి దూకి అవతల ఒడ్డుకు చేరుకున్నాడు. ట్రాక్టరు వాగులో చిక్కుకోవడంతో అందులో ఉన్న వరి ధాన్యం మొత్తం కొట్టుకుపోయింది. ట్రాక్టర్ డ్రైవర్ అప్రమత్తంతో ప్రాణాలు కాపాడుకున్నాడు. ప్రాజెక్టు అధికారుల వైఖరికి నిరసనగా బిచ్కుంద మండలం గోపన్ పల్లి చౌరస్తా వద్ద రోడ్డు పై రాస్తారోకో ధర్నాకు దిగిన రైతులు. రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులను ధర్నాను విరమింప చేయడానికి మద్నూర్ ఎస్సై విజయ కొండ, బిచ్కుంద ఎమ్మార్వో వేణుగోపాల్ రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమింప చేశారు సాయంత్రం వేళ రైతులు ధర్నా చేయడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయినది.

## మన్మథ్ స్వామి (కపిల్ దార్ )ని దర్శించుకున్న ఎమ్మెల్యే



**చట్టం జుక్కల్ ;** జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు నిన్న నియోజకవర్గ పర్యటన ముగించుకున్న అనంతరం తన అనుచరులతో కలిసి మన్మథ్ స్వామి దర్శనానికి కపిల్ దార్ కు బయలుదేరారు.. భక్తులతో కలిసి కపిల్ దార్ కు పాదయాత్రగా వెళ్తున్న సద్గురు సోమాయప్ప గారిని మార్గ మధ్యలో కలిసి పూజలు నిర్వహించి సోమాయప్ప గారి ఆశీర్వాదం తీసుకొని వారితో కలిసి కొద్ది దూరం పాదయాత్రలో పాల్గొన్నారు.. అనంతరం కపిల్ దార్ కు చేరుకొని మన్మథ్ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు పుల్కల్ మాజీ సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డి ,సాయి పటేల్, బిచ్కుంద పట్టణ అధ్యక్షుడు సాయిల్ సెట్కార్ , గుండె కల్లూరు మాజీ ఎంపీటీసీ రాజు పటేల్ , మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శంకర్ , వికాస్ నాయక్ , రమేష్ , నాగేష్ పటేల్ , గజూ దేశాయ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## భారీ వర్షా లకు దెబ్బతిన్న రోడ్లను అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**చట్టం / పరకాల ;** మంగళవారం సంగెం మండలం బిక్కోజి నాయక్ తండా గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల ను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి గ్రామ ప్రజలు & ఐటీడీఏ సంబంధిత అధికారులతో కలిసి దెబ్బతిన్న రోడ్ల ను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, రోడ్డు మరమ్మత్తు పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి



**చట్టం / పరకాల ;** పరకాల మండలంలోని రైతులు వారు పండించినటువంటి పత్తిని 8 నుంచి 12 తేమ శాతం మించకుండా సీసీఐ కేటాయించిన కేంద్రానికి మాత్రమే తీసుకెళ్లి మద్దతు ధర రూ.8110 పొందాలని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి కోరారు. రైతులు పత్తిని విక్రయ కేంద్రానికి తీసుకెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నాణ్యమైన ఆరబెట్టిన పత్తిని పత్తి విక్రయకేంద్రాలకు తీసుకువెళ్ళే క్రమంలో వాతావరణంలో మార్పుల ద్వారా వర్షాలు పడే అవకాశం ఉన్నందున దయచేసి టార్పాలిన్ తో పత్తిని కవర్ చేసి తీసుకువెళ్లాలని రైతులకు సూచించారు.

## భారీ వర్షా ల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**పరకాల సీఐ క్రాంతి కుమార్**



**చట్టం /పరకాల;** భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరకాల సీఐ సాయి క్రాంతికుమార్ సూచించారు. ఇప్పటికే పట్టణం, పరిసర ప్రాంతాల చెరువులు, కుంటలు నిండుకుండాలా ఉన్నాయని ఆయన తెలిపారు. వర్షాలు కొనసాగితే చెరువులు మత్తడి పొసే అవకాశం, వాగులు పొంగిపొర్లే పరిస్థితులు ఏర్పడవచ్చని హెచ్చరించారు. ఈ సందర్భంలో ప్రజలు మత్తడి, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని సీఐలు సూచించారు. రోడ్లపై ప్రయాణించే సమయంలో గుంతలు, నీటి మడుగులు గమనించాలని తెలిపారు. తడిసిన కరెంటు స్థంబాలు, ట్రాన్స్ ఫార్మర్ల వద్దకు వెళ్లకూడదని, పాత మట్టి గోడల ఇళ్లలో నివసించే వారు జాగ్రత్తలు తీసుకుని సమీప బంధువుల ఇళ్లకు లేదా సురక్షిత ప్రదేశాలకు వెళ్లి ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు."అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకండి. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనూ వెంటనే పోలీస్ కు సమాచారం అందించి డయల్ 100కు కాల్ చేయాలనీ వారు ప్రజలను కోరారు.

## మహా రుద్రయాగం విజయవంతం కోసం ప్రత్యేక పూజలు



**చట్టం పరకాల:** పరకాల పట్టణంలోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయంలో నవంబర్ 17న జరగనున్న కార్తీక మాస మహా రుద్రయాగం విజయవంతంగా సాగాలని కోరుతూ సకల దేవతల అనుగ్రహ పూజను సోమవారం నిర్వహించారు. కార్తీక మాస మహా రుద్రయాగ సమితి, కుంకుమేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పరకాల పట్టణంలోని వివిధ దేవాలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగం విజయవంతం కావాలని భక్తిపూర్వకంగా ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, తోట రవి, గోవింద సంధ్యా సత్య నారాయణ, మహా రుద్రయాగ సమితి అధ్యక్షుడు ఎర్ర లక్ష్మణ్, కన్వీనర్ గందే రవి, కోకన్వీనర్ ఆముదాలపల్లి అశోక్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పైపు లీకేజీ మరమ్మత్తులు తక్షణమే చేయించిన పంచాయితీ కార్యదర్శి



చట్టం అశ్వారావుపేట : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యాలయం దగ్గర మెయిన్ పైపు లీకేజీ మరమ్మత్తులు కార్యదర్శి బింగి రామకృష్ణ ఆధ్వర్యంలో సరిచేశారు. నీటి వృధా నివారణ చర్యలు తీసుకున్నారు. గ్రామస్తులు ఈ చర్యను ప్రశంసిస్తున్నారు. ఇలాంటి సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు పంచాయతీ అధికారులు కృషి చేస్తున్నారు. గ్రామ ప్రజలకు నిరంతర నీటి సరఫరా కొనసాగేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలో సమస్యలు చెప్పిన వెంటనే పరిష్కరిస్తున్న కార్యదర్శి బింగి రామకృష్ణ ను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
బుధవారం
05.11.2025


# పంటల నష్టం వివరాలను త్వరగా నమోదు చేయండి

- దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ధర్మసాగర్ మండలం దేవునూరు, ముప్పారం గ్రామాలలో భారీ వర్షా లతో దెబ్బతిన్న పంటలు, రోడ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**చట్టం /హనుమకొండ:** భారీ వర్షాలతో దెబ్బతిన్న వరి, పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలకు పరిహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించే వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు త్వరగా నమోదు చేసి నివేదికను అందజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు.మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరు, ముప్పారం గ్రామాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు, రోడ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ధర్మసాగర్ దేవునూరు ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లు, వంతెన, వరి పంటలు దెబ్బతినగా కలెక్టర్ నడుచుకుంటూ వెళ్లి అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. రోడ్ల మరమ్మతు పనుల గురించి పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. గ్రామంలో పంట నష్టం, రోడ్ల నష్టం పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ సుమారుగా అర కిలోమీటరు మేర నడుచుకుంటూ వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో వేసిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు ఎంత మేరకు నష్టం జరిగిందని వివరాలను వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులకు చెందిన పంట పొలాలు నీట మునిగి దెబ్బతిన్న వరి పంటను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించి జరిగిన పంటల నష్టం గురించిన వివరాలను స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ లో దెబ్బతిన్న పంటల వివరాల నమోదు చేస్తున్న సమాచారాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలను సర్వే నంబర్లు, రైతుల వారీగా వివరాలను నమోదు చేయాలన్నారు. వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారానికి నివేదిక అందించాల్సి ఉండగా వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం అంచనా వివరాలను త్వరగా అందజేయాలన్నారు. అక్కడినుండి ముప్పారం గ్రామానికి చేరుకొని గ్రామంలో దెబ్బతిన్న పంటలు, రోడ్లను పరిశీలించారు. గ్రామంలో తీవ్రమైన వరద ధాటికి రోడ్లు బాగా దెబ్బతినగా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులు కలెక్టర్ కు వివరించారు. వరదలతో పశు సంపదకు జరిగిన నష్టం గురించిన వివరాలను కలెక్టర్ కు తెలియజేశారు. వరద తాకిడికి సుమారు 450 క్వింటాళ్ల వరి ధాన్యం కొట్టుకుపోయిన వివరాలను తెలియజేశారు. స్థానిక రైతులతో కలెక్టర్ మాట్లాడి వరి, పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలకు జరిగిన నష్టం గురించి తెలుసుకున్నారు. స్థానిక చెరువు నుండి వచ్చిన వరద నీటితో దెబ్బతిన్న రోడ్లను, పంట నష్టాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు వెంటనే ప్రారంభించాలని, అందుకు సంబంధించిన ప్రతిపాదిత అంచనాల నివేదికను అందజేయాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ధర్మసాగర్ రిజర్వాయర్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రిజర్వాయర్ కు ఎంత ఇన్ ఫ్లో వస్తుందని, రిజర్వాయర్ కెపాసిటీ, అవుట్ ఫ్లో గురించి నీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గత నెల 29వ తేదీన రిజర్వాయర్ లో ఉన్న నీటి సామర్థ్యం, ఇతర వివరాలను కలెక్టర్ కు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, డిఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ మంగీలాల్, ధర్మసాగర్ తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, ఏవో రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అడెల్లి పోచమ్మ పునః ప్రతిష్ఠ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం



**చట్టం బైంసా :** అడెల్లి గ్రామంలోని శ్రీ పోచమ్మ దేవస్థాన పునః ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మరియు మాజీ ఎమ్మెల్యే బోస్లె నారాయణరావు పటేల్‌కు ఆహ్వానం అందజేశారు. మంగళవారం బైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అడెల్లి గ్రామం, సారంగాపూర్ మండలం, నిర్మల్ జిల్లా దేవస్థాన కమిటీ సభ్యులు ఈ ఆహ్వానం అందజేశారు. పునః ప్రతిష్ఠ మహోత్సవానికి బోస్లె నారాయణరావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం రెడ్డి పాల్గొన్నారు. దేవస్థాన కమిటీ సభ్యులు ఈ పునః ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

## సమాచారం లేకుండా గేట్లు ఎత్తివేత

**రైతుల వడ్లు నీటిపాలు**



**చట్టం న్యూస్ బాన్సువాడ :** కామారెడ్డి జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం రైతులకు నష్టం చేశింది. కౌలస్ నాలా ప్రాజెక్టు గేట్లను మరమ్మతుల పేరుతో మంగళవారం ముందస్తు సమాచారం ఇవ్వకుండా అధికారులు ఎత్తివేశారు. దీంతో ఒక్కసారిగా నీరు దిగువ ప్రాంతాలకు చేరి బిచ్కుంద మండలం చిన్న దేవడా వాగులో వడ్ల బస్తాలను తీసుకెళ్తున్న ట్రాక్టర్ వరద ముంపులో చిక్కుకుంది. పరిస్థితిని గమనించిన డ్రైవర్ ట్రాక్టర్‌ను వదిలేసి ఒడ్డుకు చేరుకుని ప్రాణాలు దక్కించుకున్నాడు. అయితే ట్రాక్టర్‌లోని వడ్లు మొత్తం నీటిలో మునిగిపోయాయి. ఈ ఘటనపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం ఇచ్చి ఉండి ఉంటే పంటను కాపాడుకునేవాళ్లం. అధికారుల నిర్లక్ష్యమే నష్టానికి కారణం” అని వేదన వ్యక్తం చేశారు. కౌలస్ నాలా ఏఈ స్పందిస్తూ “గేట్ల మరమ్మతుల కోసం కేవలం 10 నిమిషాలపాటు మాత్రమే తాత్కాలికంగా ఎత్తాము, వెంటనే మూసివేశాం” అని తెలిపారు.

## చట్టం దినపత్రికకు స్పందన

**ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ చొరవతో ఝరి బి రోడ్డు కు మరమ్మత్తులు**



**చట్టం, తానూర్ :** నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని ఝరి బి గ్రామానికి చెందిన. ఆర్ అండ్ బి రోడ్డు పాడు గత కొన్ని సంవత్సరాల నుండి మరమ్మత్తులకు నోచుకోని రోడ్డు ఇటీవల భారీ వర్షాలతో మరింత పాడు అవడంతో పదేళ్ల పాటు రోడ్డు గుంతల మాయం కావడంతో, ఇటీవల చట్టం దినపత్రికలో వచ్చినటువంటి ఈ రోడ్డు మారుమతులు చేసేది ఎవరు అనే శీర్షికన వెలువడగా స్పందించిన ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఎట్టికేలకు మరమత్తు పనులు చేపట్టారు. వర్షా కాలంలో అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బంది కావడంతో. బోల్సా నుండి ఝరి బి తండ గ్రామం వరకు గుంతలు పడ్డచోట రోడ్డుకు మంగళవారం మరమత్తులు ఎమ్మెల్యే రామారావు పటేల్ చొరవతో రోడ్డు ప్రారంభించడం జరిగింది. వడ్ఝరి, ఝరి బి, గ్రామం, ఝరి బి తండ, గ్రామ పంచాయతీ ప్రజల తరపున ఎమ్మెల్యే రామారావు పటేల్ గ్రామస్తులు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గ్రామం నాయకులు సగ్గం దిగంబర్, బీజేపీ గ్రామం యూత్ అధ్యక్షులు గొడుగు నాగేష్ బొడ్డోళ్ళ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు

## గణపతి ఆలయ ప్రాంగణ అభివృద్ధి కి శ్రీకారం



**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలోని శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ క్షేత్ర సమీపంలో పిలిస్తే పలికే దేవుడు కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారం ఇచ్చే మన ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో కొలువుదీరిన గణపతికి ఆలయానికి శ్రీ అయ్యప్ప సేవా సమితి భక్తులు స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన అశ్విత్ పటేల్ తనకు మద్రాసు ఐఐటీలో సీటు వస్తే తను కోరిన మొక్కును తీర్చుకుంటానని గణపతిని వేడుకున్నాడు. ఇంతలో ఆ కల నెరవేరడంతో బాపూజీ జ్ఞానేశ్వర్ తన కుమారుడి కోరిక మేరకు జీఎస్ గార్డెన్ ఎదురుగా ఉన్న గణపతి ఆలయ ప్రాంగణాన్ని సుమారు 80 వేల రూపాయలతో సీసీ రోడ్డులకు పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. ఏదేమైనా అనుకున్న కోరికలు నెరవేర్చే గణపయ్యకు ఎంత ఇచ్చిన తక్కువే అని జ్ఞాని పటేల్ తన మొక్కుల రూపంలో మొక్కుని చెల్లించుకున్నట్లు వెల్లడించారు.

## మాజీ మంత్రి హరీష్ రావు తండ్రి సత్యనారాయణకు సిద్దిపేట జర్నలిస్టుల నివాళి



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా జర్నలిస్టులు హైదరాబాద్ కోకాపేట్‌లో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు కోకాపేట్ నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు. సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బాబురావు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టులు హరీష్‌రావు కుటుంబానికి ధైర్యం ఇవ్వాలని, దేవుడు ఈ దుఃఖాన్ని భరించే శక్తి ప్రసాదించాలని ప్రార్థించారు.

## మాజీ మంత్రి పరామర్శించిన మాజీ ప్రభుత్వ విప్



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** హైదరాబాదులో మంగళవారం మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావును కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. గత నెల 28వ తేదీన హరీష్ రావు తండ్రి సత్యనారాయణ మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా ఆయన ఇంటికి వెళ్లి సత్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

## శ్రీమద్భగవద్గీత శ్లోకముల జిల్లా స్థాయి పోటీలలో శ్రీ భాషిత పాఠశాల విద్యార్థులు



**చట్టం ఆర్మూర్:** ఇందూరు జిల్లా స్థాయి శ్రీమద్భగవద్గీత 18వ అధ్యాయం శ్లోకముల పోటీలు శ్రీ బాలాజీ సత్సంగ్ వారి ఆధ్వర్యంలో మంగళవారం రోజు శ్రీ భాషిత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలలో నాలుగవ తరగతి, ఐదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు గీతా శ్లోకాలను స్పష్టతతో, భావస్ఫూర్తితో పఠించడం ద్వారా తమ భక్తి భావాన్ని ప్రతిబింబించారు. ఈ కార్యక్రమానికి శ్రీ భాషిత పాఠశాల కరస్పాండెంట్ అధ్యక్షత వహించారు. ప్రధాన అతిథులుగా శ్రీ బాలాజీ సత్సంగ్ ప్రతినిధులు కృష్ణ కుమార్ గుప్తా, రవినాథ్, హరిజీవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులలో ఇంత చిన్న వయసు నుండి భక్తి, ఆధ్యాత్మికతను నేర్పిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ, మా పాఠశాలలో భగవద్గీత గత ఐదు సంవత్సరాల నుండి కొనసాగుతూ వస్తుందన్నారు. భగవద్గీతలోని సూత్రాలు మన జీవితానికి మార్గదర్శకం, ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో నైతికత, ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మిక చింతన పెంపొందిస్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## అకాల వర్షా ల వల్ల పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి

**బిఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ జగన్ మోహన్**



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** ఇటీవల కురిసిన అకాల వర్షాలు మరియు 'మెంథా' తుపాను ప్రభావంతో నిర్మల్ జిల్లాలోని రైతాంగం తీవ్ర నష్టాన్ని ఎదుర్కొందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్ మోహన్ విజ్ఞప్తి చేశారు. ముదోల్ నియోజకవర్గ కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని అనేక మండలాలు, ముఖ్యంగా నిర్మల్, ముదోల్, ఖానాపూర్ మరియు భైంసా పరిధిలో భారీ వర్షాల కారణంగా వేలాది ఎకరాల్లో సాగు చేసిన వరి, పత్తి, సోయా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. కోతకు వచ్చిన వరి ధాన్యం కల్లాల్లో ఆరబెట్టే సమయంలో వర్షం కారణంగా తడిసి మొలకెత్తే ప్రమాదంలో ఉందని, దీనివల్ల రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో తగిన వసతులు లేకపోవడం వల్ల తడిసిన ధాన్యం పూర్తిగా ముద్దైపోతుందని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా ఎటువంటి కోతలు లేకుండా క్వింటాల్‌కు గిట్టుబాటు ధర చెల్లించి పూర్తిగా కొనుగోలు చేయాలని సూచించారు. పంట పూర్తిగా దెబ్బతిన్న ప్రతి ఎకరాకు ₹25,000 నష్టపరిహారం ప్రకటించి, రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేయాలని జగన్ మోహన్ కోరారు. అలాగే నష్టం శాస్త్రీయంగా అంచనా వేసి పూర్తి నివేదిక విడుదల చేయాలని, అకాల వర్షాల కారణంగా పత్తి పంటలో పెరిగిన తేమ శాతాన్ని సాకుగా చూపకుండా పూర్తి మద్దతు ధరతో పత్తిని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలి అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా మహిళ ఇన్‌చార్జ్ లక్ష్మీ యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనిల్ పవార్, సింగారే సునీల్, గడపాలే శ్రీధర్, చాకటి ఆనంద్, పార్టీ నాయకులు శివ, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 15న జరగనున్న స్పెషల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు,**



**చట్టం మెదక్ ప్రతినిధి :** పెండింగ్లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించేందుకు న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ, ప్రతి పోలీస్ అధికారి బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ సూచించారు. ఈ రోజు పోలీస్ కార్యాలయంలోని మీటింగ్ హాల్ లో జిల్లా పోలీసు అధికారులు మరియు కోర్ట్ డ్యూటీ సిబ్బందితో జిల్లా ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్లో ఉన్న కేసులను సమర్థవంతంగా పరిష్కరించేందుకు న్యాయవ్యవస్థతో సమన్వయం అవసరమని అన్నారు. ప్రతి అధికారి బాధ్యతతో వ్యవహరిస్తే మాత్రమే బాధితులకు త్వరిత న్యాయం అందుతుందని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్లో ఉన్న కేసుల వివరాలను సమీక్షించిన ఎస్పీ , రాజీపడదగిన కేసులను గుర్తించి, ఈ నెల 15వ తేదీన జరగనున్న స్పెషల్ లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు. చిన్న చిన్న వివాదాలపై కోర్టుల చుట్టూ తిరగడం కన్నా పరస్పర అవగాహనతో రాజీ పడటం సమాజానికి మేలు చేస్తుందని, అట్టి కేసులను పరిష్కారం దిశగా తీసుకెళ్లేందుకు పోలీస్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ అన్నారు. అంతేకాక, క్రిమినల్ కేసుల్లో నిందితులపై తగిన ఆధారాలతో త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుని కన్విక్షన్ రేటును పెంచాలని సూచించారు. కేసుల పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ, అవసరమైతే ఉన్నతాధికారుల సలహాలు తీసుకుని ముందుకు సాగాలని తెలిపారు. బాధితులకు న్యాయం చేకూర్చడమే మన ప్రధాన లక్ష్యమని, కేసుల పరిష్కారంలో ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్పీ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ . ఎస్. మహేందర్, డీఎస్పీలు . ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐలు, వెంకట రాజా గౌడ్ , రేణుక రెడ్డి, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, జర్జ్,. మహేష్, రాజా శేఖర్ రెడ్డి, జిల్లా షోలు, కోర్ట్ డ్యూటీ సిబ్బంది పాల్గొన్నారు

## కొత్త సివిల్ సర్జన్ రాక తో ఆసుపత్రి సేవలలో మరింత నాణ్యత



**చట్టం రామగుండం :** గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి నూతన సివిల్ సర్జన్ అండ్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంవో)గా డాక్టర్ కృపాబాయి నియమితులయ్యారు. త్వరలో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు కృపాబాయి నియామకాన్ని స్వాగతించారు. కొత్త సివిల్ సర్జన్ రాకతో ఆసుపత్రి సేవల నాణ్యత మరింత పెరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

## సైబర్ మోసాలకు గురికాకండి



**చట్టం న్యూస్ బాన్సువాడ :** రాజంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ గర్ల్స్ హై స్కూల్‌లో మంగళవారం విద్యార్థినులకు సైబర్ నేరాలు, ప్రేమలో మోసాలు, బాల్య వివాహాలు, యువత పెడదారి, మానవ అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు, సబ్-ఇన్‌స్పెక్టర్ రాజు పర్యవేక్షణలో కామారెడ్డి జిల్లా పోలీస్ కళాబృందం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా పీసీ ప్రవీణ్ విద్యార్థినులకు ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, యూపీఐ, ఏటీఎం మోసాలు, సోషల్ మీడియాలో అపరిచితులను నమ్మడం వల్ల కలిగే ప్రమాదాలు గురించి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ 1930, డయల్ 100 వంటి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.షీ టీమ్స్ సభ్యులు డబ్ల్యూపిసి సౌజన్య బాలికల భద్రతపై మాట్లాడి, వేధింపులపై వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. సహాయం కోసం షీ టీమ్స్ నంబర్ 8712686094 అందుబాటులో ఉందని తెలిపారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, గంజాయి-డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై సమాచారం అందించారు. పోలీస్ కళాబృంద ఇంచార్జ్ హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, పీసీ యు సాయిలు పాటలతో వినోదాత్మకంగా సందేశాలు అందించి విద్యార్థినులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ విజయలక్ష్మి, పీసీ కే.రాజేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షేక్‌పేట్‌లో కాంగ్రెస్ ప్రచారం



**చట్టం న్యూస్ బాన్సువాడ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా, మాజీ శాసనసభ్యులు - బాన్సువాడ కాంగ్రెస్ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి సూచనల మేరకు షేక్‌పేట్ డివిజన్ పరిధిలోని బూత్ నం.19 - మారుతి నగర్, సీతానగర్ కాలనీలలో కాంగ్రెస్ నేతలు ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ కమలాకర్ రెడ్డి ఇంటింటికీ ప్రచారం చేస్తూ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. స్థానిక సమస్యలు, అభివృద్ధి, ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో షేక్‌పేట్ కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణ, డ్వాక్రా నాయకురాలు సిద్ధి జ్యోతి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పోగు పాండు, రెంజర్ల అనిల్ కుమార్, వర్ని గ్రామ అధ్యక్షుడు మోహిన్, మాజీ జడ్పీటీసీ స్వరూప శ్రీనివాస్ యాదవ్, భైరాపూర్ మాజీ ఎంపీటీసీ అంజయ్య, చించెల్లి గ్రామ అధ్యక్షుడు బస్వలింగం, సిద్ధప్ప, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీ ఉపాధి హామీ గ్రామసభ



**చట్టం, ముధోల్ :** మండల కేంద్రమైన ముధోల్ లోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024 25 సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందాలు గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించి వివరాలు సేకరించారు. అదేవిధంగా కూలీలకు డబ్బు చెల్లింపుల రికార్డులను పరిశీలించారు. తనిఖీ బృందం సభ్యులు గ్రామసభలో జరిగిన పనికి సంబంధించిన రికార్డులను చదివి వినిపించారు. నుండి వచ్చిన అభ్యంతరాలను సైతం నమోదు చేసుకున్నారు. గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి అన్వర్ అలీ, తనిఖీ బృందం సభ్యులు, బీడీసీ మాజీ అధ్యక్షుడు గుంజలోళ్ళ నారాయణ, మాజీ ఎంపీటీసీ దేవోజి భూమేష్, బీసీ జేఏసీ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు పల్లే నాగేష్, గడ్డం సుభాష్, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ యోగేష్, ఫీల్డ్ అసిస్టెంట్, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ రహిత బ్యాగులను పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకుడు



**చట్టం న్యూస్ బాన్సువాడ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఈనెల నుండి సన్న బియ్యంతో పాటు ప్రతి ఒక్కరికి పర్యావరణ రహిత బ్యాగులను పంపిణి చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మరియు ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు ఆదేశానుసారం బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని 18వ, వార్డులో చౌకధరల దుకాణం షాప్ నెంబర్ (2) లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు యండి. దావూద్ గారు తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచిత బ్యాగులను పంపిణీ చేసారు.

## వజ్రఖండి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ముగ్గు వేసిన అధికారులు



**చట్టం జుక్కల్;** కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం వజ్రఖండి గ్రామంలో మంగళవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి కామారెడ్డి జిల్లా జడ్పీసి ఓ చంద్ర నాయక్ వచ్చి ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేసి ముగ్గు వేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ ఎంపీ ఓ గ్రామ నాయకుడు శివాజీ పటేల్ ఇందిరమ్మ లబ్ధిదారులు పాల్గొన్నారు

## నిర్మల్ పట్టణంలో ఘనంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ పథక సంచలనం



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్మల్ నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పథ సంచలన్ కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు కాలనీల గుండా నిర్వహించిన పథ సంచలన్ లో పాల్గొన్నారు. దేశ సేవలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఎంతో కీలకమని అన్నారు. స్వయం సేవకులు ఎన్నో విపత్తుల్లో స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. అంతకుముందు పట్టణంలోని అన్ని కాలనీవాసులు స్వయంగా జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ నిర్మల్ చౌరస్తా వద్ద చేరుకొని పట్టణంలోని ప్రధాన రహదారిపై శాంతియుతంగా ర్యాలీ చేపట్టి హిందూ సంప్రదాయ భావాలను కొనియాడుతూ విజయవంతంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ , జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, ముఖ్య అతిథులు శ్రీరామ్ భరత్ జి, రిటైర్డ్ ఐపీఎస్ ఎం.కె సింగ్, చిటికేశ్ శ్రీనివాస్, నగర్ సంచాలక్ డా". ప్రమోద్ చంద్రారెడ్డి, స్వయం సేవకులు సంఘ సభ్యులు భారీ సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

## మాచాపూర్‌లో ఘనంగా ఎస్.జి.ఎఫ్ రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

**ఆర్.డీ.ఓ పార్థసింహా రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం**



**చట్టం /ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మండలం మాచాపూర్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి ఎస్.జి.ఎఫ్ రెజ్లింగ్ పోటీలు మంగళవారం భవ్యంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన అతిథిగా విచ్చేసిన రెవెన్యూ డివిజనల్ అధికారి పార్థసింహా రెడ్డి చేతుల మీదుగా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలోనూ రాణించాలని, క్రీడా స్ఫూర్తి మనిషిని క్రమశిక్షణతో ముందుకు నడిపిస్తుందని తెలిపారు. ఈ పోటీలలో అండర్ 14 విభాగంలో 120 మంది, అండర్ 17 విభాగంలో 150 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రజిత వెంకట్ రెడ్డి, మండల విద్యాధికారి ఎల్.రాజులు, ఎస్.జి.ఎఫ్ జిల్లా సెక్రటరీ హీరా లాల్ పాల్గొన్నారు. అలాగే పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి, నర్సింలు, రెజ్లింగ్ ప్రెసిడెంట్ విజయ్ చౌహాన్, సెక్రటరీ పవన్ కుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆకుల కిష్టయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు హాజరయ్యారు.

# రైతు భరోసా యాప్‌లో పంట నష్ట వివరాల నమోదు

**వ్యవసాయ అధికారి వెంకటేష్**



**చట్టం శంకరపట్నం :** శంకరపట్నం మండల కేంద్రంలో మొన్న కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతుల పంట పొలాలను వ్యవసాయ అధికారులు మంగళవారం క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా నష్టపోయిన రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో ఏఈఓ (అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు)లు నమోదు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి (ఏవో) వెంకటేష్ తెలిపారు. రైతులు తమ పంట నష్ట వివరాలను నమోదు చేయడానికి రైతు భరోసా యాప్‌ను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ నమోదు ప్రక్రియ ద్వారా నష్టపోయిన రైతులకు తగిన సహాయం అందించడానికి ప్రభుత్వానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు.

# వరద నష్ట ప్రభావిత ప్రాంతాల్లో మరమ్మత్తులు త్వరితగతిన పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** వర్షాకాలం భారీ వర్షాలు కురిసి వరదలు సంభవించినప్పుడు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో జరిగిన నష్టానికి సంబంధించి నివారణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో వివిధ విభాగాల ఇంజనీరింగ్ శాఖల అధికారులతో వరద నష్ట నివారణ చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టిన వరద నష్ట నివారణ పనులకు సంబంధించి వివరాలను ఆయా అధికారులను అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులకు సంబంధించి సమాచారాన్ని అధికారులు కలెక్టర్ కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. చేపట్టిన పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా నాణ్యవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల ఇంజనీరింగ్ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నేడు తానూరులో కుస్తీ పోటీలు



**చట్టం తానూర్ :** నిర్మల్ జిల్లా తానురు మండల కేంద్రంలో ఇటీవల గత ఏడు రోజుల నుండి విట్టల రుక్మాయి ఆలయ క్షేత్రంలో హరినామ సప్త వేడుకలు కొనసాగించగా, నేడు కార్తీక మాస పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం నిర్వహించే మల్లయోధుల కుస్తీ పోటీలను, తాండూర్ మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల ముందర కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్ష కార్య నిర్వహణ సభ్యులకు ప్రకటనలో తెలిపారు. అంతకుముందు కుస్తీ పోటీలో భాగంగా మహారాష్ట్ర మన రాష్ట్రం నుండే కాకుండా వివిధ జిల్లా మండలాల గ్రామాల సుధీర ప్రాంతాల నుండి మల్లయోధులు కుస్తీ పోటీలో పాల్గొనేందుకు ఆసక్తిగా వస్తారని మొదటి రెండవ బహుమతి పొందిన వారికి వెండి కడియం తో పాటు నగదు పారితోషకం అందించడం జరుగుతుందని అదేవిధంగా ఇప్పటికే జాతరలో భాగంగా చిరు దుకాణాలు ఆలయం నుండి బస్టాండ్ వరకు వెలువడటంతో భక్తులతో కోలాహలంగా మారింది గత 100 సంవత్సరాల నుండి అఖండ దీప ప్రజావాలన జరపడం ఇక్కడ అరుదైన విశేషం ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులతో పాటు మల్లయోధులు తరలివస్తారని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కమిటీ నిర్వాహక సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు

# ప్రభుత్వ సలహాదారున్ని సన్మానించిన మాజీ సిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి



**చట్టం న్యూస్ బాన్సువాడ :** రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు సలహాదారులుగా ఇటీవల నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ను మంగళవారం హైదరాబాద్‌లో మాజీ నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పోచారం భాస్కర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి అభినందనలు తెలియజేస్తూ పూలగుచ్ఛం అందించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలు, భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమాలపై ఇద్దరు నేతలు చర్చించారు.

# మత్తమాల విద్యార్థుల ప్రతిభకు కరతాళధ్వనులు..!



**చట్టం / ఎల్లారెడ్డి :** తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ (TSGHMA) మరియు TSAT నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మండల స్థాయిలో యాన్యువల్ స్టూడెంట్ కాంపిటీషన్-2025 మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, మాట్లాడే నైపుణ్యం, విజ్ఞాన ప్రదర్శనలను వెలికితీయాలనే ఉద్దేశ్యంతో ఈ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి రాజులు ప్రత్యేకంగా హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఎల్లారెడ్డి మండలం మత్తమాల గ్రామంలోని జెడ్‌పీహెచ్ఎస్ విద్యార్థులు పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. కేవలం ఒకే పాఠశాలకి చెందిన 10వ తరగతి విద్యార్థులు మూడు విభాగాల్లో తమ ప్రతిభను చాటడం విశేషం. మొదటి పోటీ వ్యాసరచన విభాగంలో షేక్ నజిమిన్, రెండవ విభాగంలో వక్తృత్వ పోటీలో యం. నందిని, మూడవ పోటి క్విజ్ విభాగంలో కె. వంశీ ప్రతిభ కనబరచి అందరి ప్రశంసలు అందుకున్నారు. విద్యార్థుల విజయంపై పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల ఉత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత అందరినీ ఆకట్టుకుంది. నిర్వాహకులు విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పోటీ మనోభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు బాటలుదిస్తాయని ఎంఈఓ రాజులు తెలిపారు.

# యువత వ్యసనాలకు దూరంగా ఉండండి..

**మానసిక వైద్య నిపుణులు రమణ**



**చట్టం ప్రతినిధి కామారెడ్డి;** విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనవుతారని, ఈ వయసులో వచ్చే అవరోధాలను జయిస్తేనే అనుకున్న లక్ష్యాన్ని చేదించగలుగుతారని జిల్లా మానసిక వైద్యాధికారి డాక్టర్ రమణ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఆరోగ్య శాఖ, ఎక్సైజ్, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిరోధకం, మానసిక సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఏర్పరచుకొని పట్టుదలతో, ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలు తీసుకోవడం ద్వారా మానసిక సమస్యలకు గురవుతారన్నారు. సమాజంలో మత్తుపదార్థాలకు బానిసైన, మానసిక సమస్యలకు గురైనా తప్పకుండా తమను సంప్రదించాలని తెలిపారు. అనంతరం ఎక్సైజ్ సీఐ సంపత్ మాట్లాడుతూ మత్తుపదార్థాలు వినియోగించే విద్యార్థులు, యువతపై చట్టపరంగా తీసుకునే కఠిన చర్యలపై వివరించారు. ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తులు తారసపడితే తమను తప్పనిసరిగా సంప్రదించాలని సూచించారు. సిడబ్ల్యుసి మెంబర్ స్వర్ణలత మాట్లాడుతూ 18 సంవత్సరాల లోబడి ఉన్న విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై ఏ క్షణంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారో తమ దృష్టికి వస్తున్నాయని, చట్టం ఎవరిని ఉపేక్షించదని తెలిపారు. మత్తులో టీనేజీ పిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, ఫోక్సో కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. సైకియాట్రిక్ సోషల్ వర్కర్ డా.రాహుల్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు వారికి గానీ, వారి చుట్టుపక్కల వారికి కానీ ఎటువంటి మానసిక సమస్యలేదురైనా ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ టెలి మానస్ 14416 ను, మత్తుపదార్థాల వినియోగం పై సమాచారం తెలిస్తే 14446 ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఇర్ఫానా తో పాటు అధ్యాపక, ఆరోగ్య, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు కళాజాత బృందం సభ్యులు రామంచ తిరుపతి పాటల రూపంలో మత్తుపదార్థాల వినియోగం వల్ల ఏ విధంగా నష్టపోతారో విద్యార్థులకు వివరించారు.

# ఫోక్సో కేసులో ఒకరికి 20 సంవత్సరాల కారాగార శిక్ష 5000 రూపాయల జరిమానా

**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ జిల్లాలో 2020 సంవత్సరంలో కడెం మండలం చిన్న క్యాంపు కన్నాపూర్ గ్రామానికి చెందిన గట్టు గంగారం అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన 09 ఏళ్ల చిన్నారిపై అసభ్యకరంగా ప్రవర్తించి అత్యాచార యత్నంకు పాల్పడ్డాడు. ఈ ఘోర ఘటనపై కడెం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణ సందర్భంగా సంబంధిత సాక్ష్యాలు, ఆధారాలను పరిశీలించిన తరువాత, మంగళవారం నిర్మల్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టుఫోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో న్యాయమూర్తి శ్రీవాణి, నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష విధించడంతో పాటు రూ.5,000/జరిమానా విధించారు.ఈ సందర్భంగా ఎస్పీ డా: జి.జానకి షర్మిల మాట్లాడుతూ... సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుండి తప్పించుకొలేరని ఎస్పీ తెలిపారు.. నిర్మల్ పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ, న్యాయ నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు. పోలీసు శాఖ ప్రజల భద్రతకు కట్టుబడి, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటూ, న్యాయస్థానాల ద్వారా శిక్షలు పడటానికి తగిన సాక్షులను న్యాయస్థానాలలో ప్రవేశపెట్టటానికి నిర్మల్ పోలీసులు కృషి చేస్తున్నారు.

# అభివృద్ధి అనే పేరుతో నగరాన్ని కూల్చడమేనా మీ లక్ష్యం

- రామగుండంలో ప్రజాస్వామ్యం లేదు అధికారుల రాజ్యమే ఉంది
- నీవు అధికారంలోకి వచ్చినంక ఎంత మందికి కొత్త ఉద్యోగాలు ఇప్పించావు
- రామగుండం బి ఆర్ ఎస్ పార్టీ నేత కౌశిక్ హరి ఎమ్మెల్యే పై తీవ్ర ఆరోపణలు



**చట్టం రామగుండం:** ప్రజాస్వామ్య పద్ధతిలో బలహీన పరిస్థితుల్లో ఓటేసి గెలిపించిన ప్రజలను రోడ్డు పాలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని రామగుండం బీఆర్ఎస్ పార్టీ కౌశిక హరి తీవ్రస్థాయిలో ఎమ్మెల్యే తీరుపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా సోమవారం హనుమాన్ నగర్ లో రేడియం శ్రీనుపై జరిగిన దౌర్జన్యానికి సంబంధించి శ్రీనన్నను కలిసి అడిగి పరామర్శించారు. అనంతరం కౌశిక హరి మీడియాతో మాట్లాడుతూ....1టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి చేసిన దౌర్జన్యాన్ని కఠినంగా ఖండిస్తున్నామని అన్నారు. మీరు ఎవరో ఆజ్ఞలకు ఇలా చేయడం సరైనది కాదని తెలిపారు. రామగుండంలో ప్రజాస్వామ్యం లేదు. అధికారులుగా వ్యవహరించే వారు లేరు. కేవలం ఒక గూటి శక్తులదే నిర్ణయాలు అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎవరికైతే పోలీస్ అధికారులు 1టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి,ఎస్ఐ లు రిజైన్ ఇచ్చి మక్కాన్ సింగ్ సైన్యంలో చేరండి, లేకపోతే మక్కాన్ సింగ్ సేవా సమితిలో అయిన చేరండి, లేకపోతే కాంగ్రెస్ పార్టీలో చేరి కార్పొరేటర్‌గా లేదా ఎమ్మెల్యేగా పోటీ చేయండి, మాకు వ్యతిరేకత, అభ్యంతరం కానీ లేదు. ప్రజా కోర్టులో మీరు చేసే పని ప్రజా కోపం విచ్చిన్నంగా వినిపించింది.గోదావరిఖని చౌరస్తా నుంచి న్యూ అశోక్ థియేటర్ వరకు రూట్ మ్యాప్, రోడ్డు వెడల్పు గురించి సరైన ప్రణాళిక లేకుండా మార్పులు చేయడం ట్రాఫిక్ సమస్యలను, భద్రతా అంశాలను భవిష్యత్తులో తీవ్రంగా ప్రభావితం చేస్తాయని తెలిసిన ఎందుకు సమస్య పరిష్కారానికి దారి చూపడం లేదని కౌశిక హరి ప్రశ్నించారు. గ్రేటర్ పరిధిలో ఉన్న అభివృద్ధి నమూనాను రామగుండంలో తక్షణమే వర్తింప చేయాలనుకోవడం సాధ్యం కాదని తెలిసిన సరైన ప్రణాళిక లేకుండా చేయడం సాధ్యం కాదని తెలిసిన ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరైన పద్ధతి కాదన్నారు.సింగరేణి మున్సిపాలిటీ పరిధిలో ఎవరు, ఎటువంటి కూల్చివేతలు, పునర్నిర్మాణాలు జరుపుతున్నారో స్పష్టత లేదని సాధారణ ప్రజలు, సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. పొద్దైతే ఒకరు వస్తాడు, సాయంత్రం మరొకరు వస్తాడు. బ్లాక్ మెయిల్, ఒత్తిడి ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితులు వాపోతున్నారని అన్నారు. గోదావరిఖని చౌరస్తా నుంచి న్యూ అశోక థియేటర్ వైపు రోడ్డు వెడల్పు ఎంత వరకు ఉండాలో ప్రణాళిక చేసుకొని రూట్ మ్యాప్ సరిదిద్దుకోవాలి. గ్రేటర్‌లో ఉన్నట్టు ప్రతిదీ ఇక్కడా సాధ్యం కాదు. దీనివల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని ఆయన విమర్శించారు. ఏ అధికారితో సంప్రదింపులు లేకుండా సింగరేణి మున్సిపాలిటీ కూలగొట్టడాలు చేస్తున్నారు. అసలు కూల్చే అధికారం వీరికి ఎక్కడిది? వీటన్నిటికీ పట్టాలు ఉన్నాయి. ఉదయం ఒకరు వస్తారు బ్లాక్‌మెయిల్ చేస్తారు, సాయంత్రం మరొకరు బాయ్‌తో మాట్లాడమంటారు. కాలవాలని అంటారు. ఇది ఎక్కడి వ్యవస్థ? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌కు దమ్ము లేదు. పోలీసు, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులను వాడుకొని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఓసీపీ5, బూడిద, ఎస్సిఆర్ రోడ్డు, మట్టి మీద డబ్బులు సంపాదిస్తున్నారని ఆరోపించారు.అలాగే ప్రభుత్వ సంస్థల్లో అవినీతి, ఉద్యోగా ల అమ్మకాలపై ఘాటుగా స్పందించారు. ఎన్టీపీసీ, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగాలు ఎవరి ఆధ్వర్యంలో అమ్ముకుంటున్నారు..? నువ్వు వచ్చిన తర్వాత కొత్త ఉద్యోగాలు ఏమైనా వచ్చాయా..? ఎంత మంది యువకులకు ఉద్యోగాలు వచ్చాయి. 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న నీ సొంత నాయకులకు కూడా ఉపాధి చూపించలేకపోయావు అని ఎమ్మెల్యే తీరుపై కౌశికహరి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇక్కడ అధికారులు ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం చూపిస్తున్నారని చట్టబద్ధత లేకుండా కూల్చివేతలు జరుగుతున్నాయని. భవిష్యత్తు తరాలకు ప్రమాదం ఏర్పడుతోందని ఆయన ఆవేదన తెలిపారు.ఇకనైనా అధికారులు ప్రజలతో సంప్రదింపులు జరిపి నిర్ణయాలు తీసుకోవాలని. లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో కలిసి ఉద్యమానికి దిగుతుందని హెచ్చరిక జారీ చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ నగర్ రేడియం శ్రీను మాట్లాడుతూ... ఎన్నికల్లో ఓటు కోసం వచ్చినప్పుడు ఈ రామగుండం ప్రాంతాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుతా మీ ఇండ్లను కూలగొట్టిస్తా రోడ్లన్నీ వెడల్పు చేయించి చిరు వ్యాపారస్తులను వీధిపాలు చేస్తా అని హామీలు ఇవ్వకుండానే అకస్మాత్తుగా వచ్చి ఎలాంటి సమాచారాలు ఇవ్వకుండా చేయడం పైన మీ ఆలోచన విధానం ఏంటని సూటిగా ప్రశ్నించాడు. అన్యాయం జరుగుతుందని నిలదీస్తే పోలీసుల చేత చితక బాధించిన సంఘటనలు ఈ ప్రాంత ప్రజలందరూ చూస్తున్నారని విమర్శించారు. రామగుండం నోటిఫైడ్ ఏరియా నుండి మున్సిపాలిటీ కార్పొరేషన్ వరకు ఎదిగిన ఈ ప్రాంతంలో ఎవరు కూడా ఇలా కూల్చి వేయలేదని ముందే చెప్పి ఐడియ సేకరణ చేసుకున్న తర్వాతనే చేశారని నీవు ఇలా చేసి నిరాశ్రయం చేయడంపై నీవు మళ్ళీ ఎట్లా ఓట్లు అడుగుతావో మేమంతా చూస్తామంటూ సవాల్ చేశారు. గత ఎన్నికల ప్రచారంలో ఒక్కసారి అవకాశం ఇవ్వండి నేర్చుకుంటూ పోట్లాడడానికి వచ్చి మా ఓట్లు అన్నింటితో భారీ మెజార్టీతో గెలిచి ఈనాడు మమ్మల్ని ఏడిపిస్తూ ఇలా వీధిన లాగడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. మేము పేదవాళ్ళము మీరు చెప్పినట్టుగానే ఇల్లు కట్టుకోవాలని సూచించడం ఎంత వరకు సమంజసం. మేము పేదవాళ్ళము తడకలు పందిరిలు వేసుకొని మాకు తోచిన విధంగా ఇండ్ల నిర్మాణం చేసుకుంటామే కానీ నీవు చెప్పిన ప్రకారంగా భవనాలు కట్టుకోవాలంటే మా వల్ల కాదు ఒకసారి ఆలోచించండి అని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన దళిత బంధు వు విద్యార్థులకు స్కూటీలు మహిళలకు 2,500 మృతి బతుకమ్మ చీరలు ఇస్తానన్న హామీలను తుంగలో తొక్కి వాటి గురించి అడుగుతే అడిగిన వారిని దౌర్జన్యంగా పోలీసులు చేత కొట్టించి మీ నీచ ప్రవృత్తిని బహిర్గతం చేసుకుంటున్నారు రాబోయే రోజుల్లో ప్రజలే సరైన గుణపాఠం చెప్తారు. అనేది కాచుకోండి అని సవాల్ విసిరారు.

# సేవా కార్యక్రమాల్లో బీర్కూర్ లయన్స్ క్లబ్



**చట్టం న్యూస్ బీర్కూర్:** బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సమాజ సేవకు ముందుండే లక్ష్యంతో క్లబ్ చేపట్టిన కార్యక్రమాలు గ్రామస్థుల నుంచి అభినందనలు అందుకున్నాయి. మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు మొత్తం మూడు గ్యాస్ స్టవ్‌లను క్లబ్ తరఫున పంపిణీ చేశారు. అందులో ఒక గ్యాస్ స్టవ్‌ను ధూళిగా బలయ్య తమవంతు సహాయంగా అందించడం విశేషం. తదుపరిగా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో స్థానికులు శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన యువ రైతు ప్రతాప్ నాయక్‌కు “ఉత్తమ యువ రైతు” పురస్కారాన్ని అందించి లయన్స్ క్లబ్ సన్మానించింది. అలాగే ప్రతి రైతు ఆదర్శ రైతుగా ఎదగాలని లక్ష్యంగా ముందుకు సాగుతూ పనిచేస్తున్న లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఫార్మర్ సెక్రటరీ పల్లెంపాటి శివన్నారాయణ గారిని గౌరవ పూర్వకంగా సన్మానించారు. నవంబర్ నెలలో గ్రామాల్లో ఉచిత డయాబెటిస్ పరీక్షా శిబిరాలు నిర్వహించేందుకు క్లబ్ ప్రత్యేక సమన్వయం చేస్తున్నట్లు సభ్యులు తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ ఫార్మర్ సెక్రటరీ పల్లెంపాటి శివన్నారాయణ, రీజియన్ చైర్మన్ పావులూరి వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ సుమలత, అంగన్వాడీ టీచర్లు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలే రమేష్, ట్రెజరర్ మేకల గాలయ్య, జోన్ చైర్మన్ కొట్టూరి సంతోష్, సీనియర్ సభ్యులు M.A. రషీద్, మేకల విఠల్, కిషోర్ దాస్, విజయదత్తు బాబు, వీరయ్య సెట్, పెండ్యాల రమేష్, కార్తీక్ పటేల్, బస్వంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అవినీతి బహిర్గతం విద్యార్థుల ఆవేదన, అధికారులు ఎక్కడ?



**చట్టం, బాన్సువాడ:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో భోజన నాణ్యతపై విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తూ గిరిజన విద్యార్థుల కోసం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నా, పాఠశాల స్థాయిలో అవినీతి, నిర్లక్ష్యం తీవ్ర స్థాయిలో కొనసాగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థి సంఘాల నేతలు వెల్లడించిన వివరాల ప్రకారం, పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం అందడం లేదని, వారానికి ఒకసారి ఇవ్వాల్సిన చికెన్ పాడై వాసన వచ్చే స్థితిలో వండుతున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. సాంబారులో నీళ్లు కలిపి వడ్డిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అందించాల్సిన గుడ్లు, స్నాక్స్‌లు సమయానికి అందక విద్యార్థులు నిరాశ చెందుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితులను ప్రశ్నించిన విద్యార్థులను “టీ.సీ ఇచ్చి పంపిస్తాం” అంటూ బెదిరించడం అమానుషమని విద్యార్థి నాయకులు తీవ్రంగా విమర్శించారు. పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమని వారు పేర్కొన్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

జిల్లాలో ఎస్.టీ. వెల్ఫేర్ అధికారులు ఉన్నప్పటికీ, పాఠశాలల నిర్వహణపై ఎటువంటి పర్యవేక్షణ జరగడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉన్నతాధికారులు పర్యటనలకు వచ్చినప్పుడు మాత్రమే చూపు కోసం ఫొటోలు, ప్రదర్శనలు నిర్వహించడం కంటే, వసతి, పరిశుభ్రత, భోజనం నాణ్యత వంటి అంశాలను స్వయంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులను కాపాడడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో భోజన నాణ్యతపై తక్షణ విచారణ జరపాలని విద్యార్థి నాయకులు కోరారు. ఈ సమావేశంలో ఏఐఎస్బీ రాష్ట్ర నాయకులు జవారే రాహుల్, జిల్లా అధ్యక్షుడు బైరాపూర్ రవీందర్ గౌడ్‌తో పాటు రమేష్ గౌడ్, సాయికిరణ్, పృథ్వీరాజ్, అంజిరెడ్డి, ప్రసాద్, సుదర్శన్, రాజు, జగన్, జ్ఞానేశ్వర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాటన్ కాపాస్ అప్ పై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన



**చట్టం మెదక్ ప్రతినిధి :** కాటన్ కాపాస్ అప్ పై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం టెక్మాల్ రైతు వేదికలో శంకరంపేట్ అ డివిజన్ పరిధిలోని వ్యవసాయ శాఖ అధికారులకు కాటన్ కాపాస్ అప్ గురించి సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమీక్ష సమావేశానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరంపేట్ అ డివిజన్ పరిధిలో మొత్తం 21193 మంది రైతులు 34903 ఎకరాలలో ప్రత్తి పంట సాగుచేసారాని ప్రతి గ్రామంలో రైతులకి వ్యవసాయ అధికారులు కాటన్ కపాస్ అప్ గురించి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని రైతులు ఎవరు కూడా దళారులకి అమ్మి మోసపోకుండా ఈ కపాస్ అప్ లో అందరు స్లాట్ బుక్ చేసుకొని జీన్నింగ్ మిల్ కు తీస్కొని వచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాలను మానిటరింగ్ చేసేందుకు... AMC లా వారీగా లోకల్ కమిటీ లను నియమించి..ఎప్పటికప్పుడు రైతులు మద్దతు ధర పొందెల కృషి చేయాలన్నారు అదేవిధంగా లీగల్ మెట్రాలాజి అధికారులు తేమ కొలిచే యంత్రాలను పరిశీలించాలన్నారు. సీసీఐ అధికారుల పర్యవేక్షణ ఉండాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా జీన్నింగ్ మిల్లు యాజమాన్యం తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్ని మాపాక శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ జాతీయ ఆహార భద్రత పథకం కింద జొన్న విత్తనాలని 100% రాయితీ పై రైతులకి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ ఇంచార్జి ada రాంప్రసాద్ ఆయా మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

# మోస్రా మండలానికి పాత ఎంపీడీవో



**చట్టం న్యూస్ మోస్రా :** నిజామాబాద్ జిల్లా మోస్రా మండల ఎంపీడీవో గా పని చేసిన కే. శ్రీనివాస్ బదిలీపై ఎడపల్లి మండలానికి వారం రోజుల క్రితం బదిలీపై వెళ్లడం జరిగింది. శ్రీనివాస్ స్థానంలో ఎంపీడీవో గా సాయికుమార్ బాధ్యతలు తీసుకున్నారు. కొన్ని అనువార్య కారణాలతో ఎంపీడీఓ సాయికుమార్ లాంగ్ లీవ్ తీసుకోవడంతో వారం రోజుల క్రితం బదిలీపై వెళ్లిన ఎంపీడీవో కే .శ్రీనివాస్, మంగళవారం మోస్రా ఎంపీడీవో గా బాధ్యతలు తీసుకున్నారు.

# హోం గార్డ్ అధికారి శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటాం : జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి భరోసా



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ (MT) సెక్షన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అకాల మరణం చెందిన హోం గార్డ్ అధికారి సి.హెచ్. శ్రీనివాస్ కుటుంబ సభ్యులను జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పోలీసులు ఎల్లప్పుడూ వారి పక్కనే ఉంటారని భరోసా ఇచ్చారు. శ్రీనివాస్ హఠాత్తుగా మరణించటం తమను తీవ్రంగా కలచివేసిందని, ఇది పోలీస్ శాఖకు కూడా తీరని లోటు అని ఎస్పీ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. మరణానికి గల కారణంపై ప్రస్తుతం సమగ్ర దర్యాప్తు జరుగుతోందని, ఆయన విధులు నిర్వహిస్తున్న సమయంలో కరెంట్ షాక్ కారణమా లేక మరేదైనా ఇతర కారణమా అన్నది స్పష్టతకు రావాల్సి ఉందని తెలిపారు. ఈ విషయంలో పోస్ట్‌మార్టం (PME) తుది నివేదిక అత్యంత కీలకమని, ఆ నివేదిక వచ్చే వరకు ఎటువంటి ముందస్తు నిర్ణయాలకు రావద్దని సూచించారు. కుటుంబ సభ్యులు ఎవరూ కూడా ఆందోళన చెందవద్దని, పోలీస్ శాఖ తరపున అన్ని విధాల సహకారం అందిస్తామని ఎస్పీ నారాయణ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ క్లిష్ట సమయంలో శాఖ తరపున తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, వికారాబాద్ ఇన్‌స్పెక్టర్ భీమ్ కుమార్ తదితర అధికారులు కూడా పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి



**చట్టం మెదక్ ప్రతినిధి :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి. మంత్రి వివేక్ వెంకటస్వామి, ఫాహీం ఖురేషీ, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్, M.A. ఫాహీం, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, ఉజ్వల్ రెడ్డి, తదితరులతో కలిసి షేక్ పేట్ డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ “జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల విశ్వాసం ఉంచి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నాను” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయికి ఎల్లారెడ్డి గురుకుల విద్యార్థుల దూకుడు

**69వ SGF పోటీల్లో బంగారు పతకాలతో మెరిసిన ప్రతిభ**



**చట్టం / ఎల్లారెడ్డి :** 69వ (SGF) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కుస్తీ పోటీల్లో ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ నిఖిల్ మాట్లాడుతూ అండర్ 17 విభాగంలో కె. సాయికుమార్ (55 కిలోల బరువు విభాగంలో) బంగారు పతకం సాధించగా, యం. ప్రసాద్ (48 కిలోల బరువు విభాగంలో) మరో బంగారు పతకంతో రాణించారని తెలిపారు. ఇద్దరూ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడం పాఠశాలకు గర్వకారణమైందన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో పార్థసింహారెడ్డి స్వయంగా హాజరై విజేతలకు బంగారు పతకాలను అందజేస్తూ, విద్యార్థులను అభినందించారు. గ్రామీణ ప్రాంతాల నుండి ఇంతటి ప్రతిభ వెలుగులోకి రావడం గర్వించదగిన విషయం. క్రమశిక్షణతో కృషి చేస్తే మరిన్ని జాతీయ స్థాయి విజయాలు సాధించగలరు అని ప్రోత్సహించారు. వారి విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ నిఖిల్, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేందర్, ఉపాధ్యాయుల బృందం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# సివిల్ సర్జన్ గా రవీందర్ గౌడ్



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ గా రవీందర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు పబ్లిక్ హెల్త్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చోంగూ ఉత్తర్వులు జారీ చేశారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డికి చెందిన డాక్టర్ రవీందర్ గౌడ్ గతంలో కామారెడ్డి, గాంధారి, దోమకొండ డిప్యూటీ డీఎంహెచ్వోగా పనిచేశారు. అలాగే జగిత్యాల డీఎంహెచ్వోగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ హెల్త్ ఆఫీసర్గా పనిచేస్తున్న ఆయన పదోన్నతి పై కామారెడ్డి జీజీహెచ్ సివిల్ సర్జన్ గా రానున్నారు. రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ తన సొంత ప్రాంత ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

CHATTAM NEWS

నిజామాబాద్
బుధవారం
05.11.2025



# పత్తి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు: శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలోని అయ్యప్ప కాటన్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రం మరియు మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మంగళవారం శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పత్తి విక్రయించడానికి వచ్చే రైతులను మిల్లుల యాజమాన్యం, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ, సీసీఐ అధికారులు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయరాదని ఆయన సూచించారు. నాణ్యత పేరిట పత్తి తిరస్కరించకుండా, తగిన సడలింపులతో కొనుగోలు చేయాలని ఆదేశించారు. తేమ శాతం విషయంలో అకాల వర్షాలు ప్రభావం చూపిన నేపథ్యంలో, ప్రస్తుత తేమ 8 శాతం నుండి 14 శాతం వరకు ఉన్న పత్తిని సీసీఐ వారు కొనుగోలు చేసే విధంగా వెసులుబాటు కల్పించాలని ఆయన కోరారు. రైతులు ఇబ్బందులకు గురికాకుండా జిన్నింగ్ మిల్లుల యాజమాన్యం, మార్కెటింగ్ మరియు వ్యవసాయ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. 202526 సంవత్సరానికి పత్తి



కనీస మద్దతు ధర రూ.8,110గా నిర్ణయించబడిందని గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,46,131 ఎకరాల్లో పత్తి సాగు జరగగా, సుమారు 2,46,725 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేయబడిందన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 50 వేల మంది రైతులు పత్తి సాగు చేస్తున్నారని తెలిపారు. వికారాబాద్ జిల్లాలో మొత్తం 14 పత్తి మిల్లుల ద్వారా 14 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తేమ శాతం 8% నుండి 12% మధ్య ఉంటే మద్దతు ధర రూ.8,110 నుండి రూ.7,785 వరకు లభిస్తుందని వివరించారు. పత్తి కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం KAPAAS KISAAN APP ద్వారా స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పించేందుకు అన్ని గ్రామాల్లో ఎఇఓలు, వ్యవసాయ అధికారులు అవగాహన సదస్సులు, కరపత్రాలు మరియు మీడియా ప్రచారం ద్వారా సమాచారాన్ని అందించాలని సూచించారు. ముందుగా ఎకరాకు 11 క్వింటాళ్ల పత్తి విక్రయించేందుకు అవకాశం ఉన్నా, కేంద్ర ప్రభుత్వం నవంబర్ 6, 2025 నుండి ఎకరాకు 7 క్వింటాళ్లకు పరిమితి విధించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 566 మంది రైతుల నుండి 1,055.88 మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు జరిగినట్లు వివరించారు. తరువాత వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 34 వార్డులకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగా నాయక్, ఆర్‌డీఓ వాసు చంద్ర, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, వ్యవసాయ అధికారి రాజారత్నం, తహసిల్దారు లక్ష్మీ నారాయణ, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, మిల్లుల యజమాని వెంకటేశ్వర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి పనుల విస్తరణకు వ్యాపార వర్గాలు సహకరించాలి

**ఆర్డిఓ పార్థసింహారెడ్డి**



**చట్టం / ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులకు వ్యాపార వర్గాలు, స్థానిక ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆర్డీవో పార్థ సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో వ్యాపార వర్గాల ప్రతినిధులు, స్థానికులతో ఆర్డీవో స్వయంగా సమావేశమై, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి పనులు పూర్తయిన తరువాత పట్టణ రూపురేఖలు మారిపోతాయి. తాత్కాలిక అసౌకర్యం ఉన్నా భవిష్యత్తు దృష్ట్యా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అలాగే నిర్మాణ పనులకు అడ్డు తగలకుండా, వ్యాపార సదుపాయాలను తాత్కాలికంగా సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ ప్రేమకుమార్, పురపాలక అధికారులు, కాంట్రాక్టర్లు, వ్యాపార సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రిన్సిపాల్ మాకొద్దంటూ రోడ్డుపై ధర్నాకు దిగిన సోషల్ వెల్ఫేర్ బాలికలు



**చట్టం కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మెట్ పల్లి పట్టణం అరపేట శివారులో గల బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ మాకొద్దంటూ విద్యార్థినిలు రోడ్డెక్కారు. గత కొంతకాలంగా వేధింపులు ఎక్కువయ్యాయని విద్యార్థినిలే కాకుండా ఉపాధ్యాయులు కూడా వేధింపులకు లోనవుతున్నారని విద్యార్థినిలు మండిపడ్డారు. జాతీయ రహదారిని నిర్బంధించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి అధికారులతో కలిసి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రిన్సిపాల్ గత కొంతకాలంగా వేధింపులకు గురి చేస్తుందని, ఇంటర్ సెక్షన్ వద్దంటుందని విద్యార్థినిలు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినిలనే కాకుండా ఉపాధ్యాయునిలను వేధించడంతో ఇద్దరూ ట్రాన్స్ఫర్ చేసుకున్నారని అందువల్ల సిలబస్ పూర్తి కాలేదని అందువల్ల పరీక్షలు రాయలేని దుస్థితి నెలకొందని అన్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ మాపై దాడులకు ప్రయత్నిస్తుందని అటువంటి ప్రిన్సిపాల్ మాకొద్దంటూ నేడు రోడ్డుపైకి వచ్చి ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని లేదంటే రోడ్డుపై కూర్చుంటామని భీష్మించడంతో అధికారులు పూర్వాపరాలు పరిశీలించి ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థినిలు శాంతించారు

# హరీష్ రావును పరామర్శించిన జర్నలిస్ట్ పిట్ల శ్రీనివాస్



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తండ్రి సత్యనారాయణ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. మంగళవారం రోజున హైదరాబాదులోని కోకాపేట్‌లో ఉన్న హరీష్ రావు నివాసానికి సిద్దిపేటకు చెందిన జర్నలిస్ట్ పిట్ల శ్రీనివాస్ వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సత్యనారాయణ గారు ప్రజామైత్రి వ్యక్తిత్వం కలిగినవారని, సమాజ సేవలో విశేషంగా నిలిచారని ఈ సందర్భంగా శ్రీనివాస్ గుర్తు చేశారు. హరీష్ రావు కుటుంబానికి ధైర్యం, ఓర్పు కలగాలని కోరుతూ ఆయన సంతాపం వ్యక్తం చేశారు.

# జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



**చట్టం న్యూస్ లింగంపేట్ :** మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు క్విజ్, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు MEO శౌకత్ అలీ తెలిపారు. టిస్యాట్ నెట్వర్క్ మరియు తెలంగాణ రాష్ట్ర గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆన్వల్ స్టూడెంట్ కాంపిటీషన్2025 సంవత్సరం మండల స్థాయి పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ క్విజ్ పోటీలో లక్ష్మన్ యాదవ్ ప్రథమ బహుమతి, వ్యాసరచనలో భానుశ్రీ భవానిపేట ఉన్నత పాఠశాల ప్రథమ బహుమతి, ఉపన్యాసం పోటీలో లింగంపేట బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని రింషా ప్రథమ బహుమతి గెలుపొందినట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు కి ఎంపికైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# కాంటా చేస్తారా ఆందోళన చేయమంటారా

**చైర్మన్ సీఈవో హామీతో శాంతించిన రైతులు..**



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** అధికారులు కాంటాలు చేయడం లేదని ఆందోళనకు దిగుతున్నారని విషయం తెలుసుకొని మాజీ జెడ్పిటిసి రాజేశ్వరరావు సింగిల్ విండో సీఈఓ, చైర్మన్ తో మాట్లాడి ఆందోళనలను విరమింపచేశారు .కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండలం భూంపల్లి గ్రామంలో మొక్కజొన్న రైతులు ప్రభుత్వం కొనుగోలు కోసం కాంటాలు ప్రారంభించడం లేదని మంగళవారం ఆందోళన చేశారు .రైతులు సదాశివ నగర్ మండల మాజీ జెడ్పిటిసి పడిగేల రాజేశ్వరరావు ఫోన్ ద్వారా సమాచారం అందించి తామరభూషణ స్థలానికి రావాలని విజ్ఞప్తి చేశారు .మాజీ జెడ్పిటిసి తో పాటు మాజీ ఎంపీపీ అనసూయ రమేష్ గ్రామ పార్టీ అధ్యక్షుడు గడీల దత్తురావు రైతుల వద్దకు చేరుకున్నారు. గాంధారి వెళ్లే మార్గంలో లింగంపల్లి స్టేజి వద్ద రాస్తారోకో చేస్తామని రైతులు పట్టుపట్టారు .దీంతో మాజీ జెడ్పిటిసి జిల్లా అధికారులతో మాట్లాడారు .తాము నిన్న రాత్రి గోనే సంచులను భూంపల్లికి పంపామని వారు తెలిపారు. దాంతో వెంటనే స్థానిక సింగల్ విండో చైర్మన్ గంగాధర్ కు సింగిల్ విండో సీఈవోకు దేవేందర్ కు ఫోన్లో మాట్లాడగా బుధవారం సెంటర్ ను ప్రారంభిస్తున్నామని రైతులను ఆందోళన చేయవద్దని సూచించాలని మాజీ జెడ్పిటిసి కోరారు .అయితే 14% తేమ ఉన్న మొక్కజొన్నలను బుధవారం నుంచి కాంటాలు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మాజీ జెడ్పిటిసి అక్కడున్న రైతులను శాంతింప చేసి వారి హామీ మేరకు ఆందోళన చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిజెపి అధ్యక్షుడు మంగలి స్వామి రైతులు బాలచంద్రం యూత్ నాయకుడు మోహన్రావు, దంతేపల్లి రాజు ,పోలీస్ సంజీవరావు ,వెంకట్ నర్సు నారాయణ, మంగళ్ ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు

# దేవునిపల్లిలో దొంగల బీభత్సం.. భారీగా బంగారం, నగదు చోరీ

**ఊరికి వెళ్లారు దొంగతనం జరిగింది**





**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** కామారెడ్డిలో దొంగలు మరోసారి రెచ్చిపోయారు. పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న దేవునిపల్లిలో భారీ చోరీకి పాల్పడి పోలీసులకు సవాల్ విసిరారు. దేవునిపల్లి గ్రామంలోని మెడికల్ కళాశాల సమీపంలో గల వినాయక నగర్లో జరిగిన చోరీ మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. కాలనీలో నివాసముండే చంద్రమోహన్ రెడ్డి ఇంట్లో ఏకంగా 6.5 తులాల బంగారం, 2.5 కిలోల వెండి ఆభరణాలు, సుమారు రూ.2.5 లక్షల నగదు దుండగులు ఎత్తుకెళ్లారు. రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లిన చంద్రమోహన్ కుటుంబ సభ్యులు ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్ రూంలో ఉన్న బీరువా తాళం పగులగొట్టి మంచంపై వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి చోరీ జరిగిన విషయాన్ని పోలీసులకు చేరవేశాడు. దాంతో దేవునిపల్లి ఎస్సై భువనేశ్వర్ ఘటనాస్థలికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ విషయమే దేవునిపల్లి పోలీసులకు ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు

# విద్యార్థులకు ఈ నెలాఖరు వరకు సిలబల్ పూర్తిచేయాలి ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శేక్ సలామ్



**చట్టం న్యూస్ లింగంపేట్ :** ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెలాకరువరకు సిలబస్ వరకు పూర్తిచేయలనిఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శేక్ సలామ్ అన్నారు. ఆయన మంగళవారం లింగంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జ్యోతీ బాపులే గురుకుల కళాశాల, కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల, మైనారిటీ గురుకుల పాఠశాలలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. 100శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని అన్నారు. కళాశాలల్లోని అడ్మిషన్ రికార్డులను, హాజరు రిజిస్టర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సం దర్భంగా ఆయన లెక్చరర్లతో సమావేశం నిర్వహించి ఆయా సబ్జెక్టుల వారిగా సలబస్‌ల వివరాలు అడిగారు. ఈ నెలాఖరు వరకు సెలబస్లు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఆయా సబ్జెక్టుల వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేకమైన వె టీరియల్సు తయారు చేసి వారు ఉత్తీర్ణులయ్యేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ప్రతిభ గల విద్యార్థులకు నీట్, జేఈఈ, ఎంసెట్లలో ప్రత్యేక జ. తరగతులు బోధించాలని వారికి మెడిసిన్ ఇంజనీరింగ్లలో సీట్లు వచ్చేలా కృషి చేయాలని ఆయన తెలిపారు. ల్యాబ్లను పరిశీలించి ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిభను పరిశీలించేంద కు వారిని ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులలో పిల్లలచే పాఠ్యాంశాలు బోధింపజేశారు. విద్యార్థులు ఈనెల 14లోపు పరీక్ష ఫీజులను ఆయా కళాశాలల్లో చెల్లించాలని ఆయన సూచించారు. విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి వచ్చేందుకు సమయానికి బస్సులు రావడం లేదని నోడల్ అధికారి దృష్టికి తీసుకువెళ్లగా డీఎంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, లెక్చరర్లు దుర్గయ్య, శివ, రాజయ్య, స్వామిగౌడ్, ధర్సింగ్. అంజయ్య, హైమద్. సంధ్యారాణి, సిబ్బంది ఆనంద్ రెడ్డి. అభినవ్, నాగయ్యలతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేస్తాం: పులిమామిడి నవీన్ గుప్తా



**చట్టం, శివ్వంపేట :** మెదక్ జిల్లా శివ్వంపేట మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతగా కొనసాగుతున్న శివ్వంపేట మాజీ సర్పంచ్ పులిమామిడి స్రవంతి నవీన్ గుప్తాను నూతనంగా మండల పార్టీ అధ్యక్షులుగా నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విషయంపై నర్సాపూర్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ద్వారా పార్టీ అధిష్టానం వర్గం కూడా వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది,2013 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత నవీన్ గుప్తా శివ్వంపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పై కీలకంగా వ్యవహరిస్తున్న విషయం అందరికీ తెలిసిందే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు నుండి జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ సుహాసిన్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్,నర్సాపూర్ నియోజకవర్గ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, కూడా శివ్వంపేట మండలంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఏ కార్యక్రమమైనా నవీన్ గుప్తాను కీలకంగా వారి వెంట ముఖ్య నాయకుడిగా ఉంచుకుంటున్నారు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధిష్టాన వర్గం ఎటువంటి పిలుపు నిచ్చిన నవీన్ గుప్తా దగ్గరుండి కార్యక్రమాల ముందుంటే కార్యక్రమాలు విజయవంతం చేస్తూ వస్తున్నారు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధిష్టాన వర్గంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, తనకు మండల పార్టీ అధ్యక్ష పదవి ఇస్తే రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో అధికార పార్టీ ఆయన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను నాయకులు కార్యకర్తలతో కలిసి గెలిపిస్తానని నవీన్ గుప్తా అంటున్నారు. ఈ సందర్భంగా నవీన్ గుప్తాను చట్టం ప్రతినిధి పలకరించగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పై తనకు పూర్తి నమ్మకం ఉంది అని తనకు అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణమాఫీ, అర్హులైన వారికి పింఛన్లు, అందరికీ అందే విధంగా కృషి చేస్తానని అన్నారు, జిల్లా డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజు రెడ్డి తోపాటు మండలంలోని ముఖ్య నాయకులు కార్యకర్తల అండదండలు తనకు ఉన్నాయని నవీన్ గుప్తా తెలిపారు. రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఈ సందర్భంగా వారు అన్నారు,

# వెల్లుట్లలో వైభవంగా శ్రీ విఠలేశ్వర రథోత్సవం



**చట్టం/ ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామంలో శ్రీ విఠలేశ్వర స్వామి వార్షిక రథోత్సవం మంగళవారం భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5.30 గంటలకు స్వామివారికి అభిషేకం, 10.30 గంటలకు రుక్మిణి సమేత కళ్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు గోపాలకాలాలు, 3.00 గంటలకు తీర్థప్రసాద వితరణతో పాటు అన్నదానం చేపట్టారు. రాత్రి 9.00 గంటలకు రథయాత్ర గ్రామమంతా భక్తిశ్రద్ధలతో సాగగా, జోషి శ్రీనివాస్ పంతులు ఆధ్వర్యంలో రాత్రి 7.00 గంటలకు కార్తీక దీపోత్సవం ఘనంగా జరిగింది. శ్రీనివాస్ పంతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు. అనేక వందల సంవత్సరాల క్రితం దోమకొండ సంస్థాన రాజుల కాలంలో నిర్మించబడిన ఈ శ్రీ విఠలేశ్వర-రుక్మిణి ఆలయం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అత్యంత పురాతన దేవాలయాల్లో ఒకటిగా నిలిచింది. ప్రతిష్ఠించిన నాటి నుండి ఇప్పటివరకు స్వామివారి మూర్తులను మార్చకపోవడం ఈ ఆలయ విశిష్టతగా చెప్పవచ్చు. భక్తుల విశ్వాసం ప్రకారం, మనసా, వాచా, కర్మణా భక్తితో ప్రార్థిస్తే స్వామివారు భక్తుల కోరికలను నెరవేర్చుతారని నమ్మకం ఉంది. మహావిష్ణువు అవతారమైన శ్రీ విఠలేశ్వర స్వామి వెలుట్ల గ్రామంలో కొలువుదీరటం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని స్థానికులు అభిప్రాయపడ్డారు. భక్తులు స్వామివారి దర్శనంతో ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణం 'జయ పాండురంగ విట్టల... జయ పండరీనాథ విట్టల' నినాదాలతో మార్మోగింది.

# పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం పెద్ద గొల్లగూడెం గ్రామంలో మహిళా ఆత్మహత్యాయత్నం చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తోట నాగమణి జీవితం పై మనస్థాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. స్థానికులు వెంటనే అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మహిళ మృతి చెందింది. ఈ విషయం పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తెలిపారు.

# స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి

- నేడు ఎమ్మెల్యే, ఎంపీల కార్యాలయాలను ముట్టడిద్దాం
- ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్



**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:–** రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ నిధుల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని విడనాడి వెంటనే నిధులను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. నేడు తేదీ 5112025 న రాష్ట్ర ఆదేశాల మేరకు విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల కార్యాలయాలను ముట్టడించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు రూ.8500 కోట్లకు పైగా స్కాలర్‌షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.విద్యార్థులు తమ చదువు కొనసాగించడానికి, ఫీజులు చెల్లించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణం స్పందించాలి, లేనిపక్షంలో విద్యార్థి సమాజం తీవ్ర ఆందోళనకు దిగుతుందని ఆకాష్ నాయక్ హెచ్చరించారు.ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.విద్యార్థుల హక్కుల కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# దేవాలయానికి మొరం అవసరం అధికారుల చుట్టూ గ్రామస్తుల తిప్పలు



**చట్టం న్యూస్ బీర్కూర్ :** కామారెడ్డి జిల్లా బీర్కూరు మండలం బైరాపూర్ గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయంలో ఈ నెల 25, 26, 27 నవంబర్ తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఏర్పాట్లలో భాగంగా జరిగే పనులకు మొరం అవసరం కావడంతో గ్రామస్థులు అధికారులను సంప్రదించారు. ఈ నేపథ్యంలో గ్రామ కమిటీ సభ్యులు బీర్కూరు రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి మొరం అనుమతి ఇవ్వాలని విన్నవించారు. అయితే మొరం అనుమతి రెవెన్యూ శాఖ పరిధిలో లేదని, ఈ విషయంలో మైనింగ్ & జియాలజీ అధికారులను, కామారెడ్డిలో సంప్రదించాలని సూచించినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం చేపట్టే ఇందిరమ్మ ఇళ్లు మరియు ఇతర ప్రభుత్వ పనులకే రెవెన్యూ శాఖ అనుమతులు ఉండగా, దేవాలయ నిర్మాణం వంటి కార్యక్రమాలకు అనుమతులు మైనింగ్ శాఖ పరిధిలో ఉంటాయని వారు వెల్లడించినట్లు సమాచారం.గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రతిష్ఠాపనకు తేదీలు ఖరారయ్యాయి. కానీ మొరం లేక పనులు ఆగిపోయాయి. అధికారులు త్వరగా అనుమతులు మంజూరు చేస్తే కార్యక్రమాలు సకాలంలో పూర్తి అవుతాయి" అని అభ్యర్థించారు. గ్రామ ప్రజలు పెద్దమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠాపనకు ఆటంకం కలగకుండా సంబంధిత శాఖలు వెంటనే స్పందించి మొరం అనుమతులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

# మాదక ద్రవ్యాలపై కామారెడ్డి పోలీసుల అవగాహన కళా జాతర



**చట్టం న్యూస్ బాన్సువాడ :** మాదక ద్రవ్యాల వినియోగం, యువతలో పెరుగుతున్న అసాంఘిక చేష్టలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నివారణపై కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కళాబృందం ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించింది. కళాబృందం సభ్యులు డ్రగ్స్, గంజాయి వాడకం, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర అలవాట్ల కారణంగా జీవితం ఎలా దెబ్బతింటుందో పాటలు, నాటికల రూపంలో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, సైబర్ మోసాల సందర్భంలో టోల్ ఫ్రీ - 1930, మహిళల భద్రత కోసం షీ టీమ్స్ హెల్ప్‌లైన్ - 8712686094 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.జిల్లా మానసిక వైద్యుడు డాక్టర్ రమణ, యువతలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల మానసిక సమస్యలు, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై పడే ప్రభావంపై చర్చించారు. ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సంపత్, డ్రగ్స్ సరఫరా చట్టపరమైన శిక్షలు, పోలీసులు చేపడుతున్న చర్యలను వివరించారు. సైకియాట్రిక్ సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్, సోషల్ మీడియా దుర్వినియోగం, ఆన్‌లైన్ మోసాల ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.పోలీస్ కళాబృందం ఇంచార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, పీసీ సాయిలు భాగస్వామ్యంతో కార్యక్రమం సాగింది. కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ ఇర్ఫానా ఫారహేన్ మరియు స్టాఫ్ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లు వెంటనే చెల్లించాలని ఏబీవీపీ ధర్నా



**చట్టం కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మెట్ పల్లి పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తా వద్ద ఏబీవీపీ నాయకుల ఆధ్వర్యంలో ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతను ఎండగడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను తగలబెట్టే విషయంలో పోలీసులకు, విద్యార్థి నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ట్రాఫిక్ పూర్తిగా స్తంభించడంతో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాడవేని సునీల్, జిల్లా హాస్టల్ కన్వీనర్ మారుతి, పట్టణ అధ్యక్షులు కలికోట ప్రణీత్ లను పోలీసు వాహనంలో తరలించడంతో ఉద్రిక్తత నెలకొంది.ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ సాయికుమార్, మున్నా, సూర్య,మణి తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి డిఎంహెచ్ ఓ బదిలీ

**ఆయనతోపాటు పలువురు బదిలీ..**



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** కామారెడ్డి డిఎంహెచ్ఓ చంద్రశేఖర్ మంగళవారం బదిలీ అయినట్లు వైద్య శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వైద్యశాఖలో బదిలీలు చోటు చేసుకున్నాయి. జిల్లా ఇన్చార్జి వైద్యాధికారిగా కొనసాగుతున్న చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. ఆయనకు వికారాబాద్ సివిల్ సర్జన్ ఆర్ఎంవో గా పోస్టింగ్ ఇచ్చారు. దోమకొండ డిప్యూటీడీఎంహెచ్వోగా కొనసాగుతున్న ప్రభు దయాకిరణ్ హైదరాబాద్ పబ్లిక్ హెల్త్ జాయింట్ డైరెక్టర్ గా నియామకమయ్యారు. ప్రస్తుతం ఈ రెండు పోస్టులలో ఎవరిని నియమించలేదు. అలాగే కామారెడ్డి జీజీహెచ్ సివిల్ సర్జన్గా రవీందర్ గౌడ్ రానున్నారు. ఈ మేరకు పబ్లిక్ హెల్త్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చోంగ్తు ఉత్తర్వులు జారీ చేశారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com